# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
గురువారం
11.06.2026

సంపుటి : 16 సంచిక: 256
పేజీలు:8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## ఫిఫా వరల్డ్ కప్ నేటి నుంచే.. 48 జట్లు

అభిమానలోకం ఊపిరి బిగబట్టి చూసే సాకర్ మహాసంగ్రామానికి కౌంట్‌డౌన్ ముగిసింది. నాలుగేండ్లకోసారి వచ్చి యావత్ క్రీడా ప్రపంచాన్ని మురిపించే ఫిఫా ప్రపంచకప్ గురువారం మొదలవుతోంది. ఈ మెగా టోర్నీకి తొలిసారి మూడు దేశాలు ఆతిథ్యం ఇస్తున్నాయి. అమెరికా, మెక్సికో, కెనడాలోని 16 నగరాల్లో, 39 రోజుల పాటు సాగే ఈ మెగా వార్ అభిమానులను కనువిందు చేయనుంది. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఆతిథ్య మెక్సికో, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగే తొలి పోరుతో ఈ సాకర్ జాతరకు తెరలేవనుంది. ప్రఖ్యాత మెక్సికో సిటీ స్టేడియం ఈ పోరుకు వేదిక కానుంది. ఈ మ్యాచ్‌కు ముందు 90 నిమిషాలపాటు అదిరిపోయే ప్రారంభ వేడుకలు నిర్వహిస్తారు. పాప్ స్టార్ షకీర తదితరులు తమ ప్రదర్శనలతో అలరిస్తారు.



# వరి వేస్తే ఉరేనా?

రాబోయే 5 ఏళ్లు, ఏటా 5 లక్షల ఎకరాల చొప్పున వరి సాగు తగ్గించాలి

తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం/నీతి ఆయోగ్ ఆదేశాలు

ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం

వరి కోసం భారీగా నీరు, విద్యుత్ వినియోగం, కొనుగోళ్ల భారం

కేంద్రం ఆదేశాలను రైతుల వద్ద దాచిపెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

పంట మార్పిడిపై స్పష్టత లేక రైతుల అయోమయం, పెరిగిన వ్యతిరేకత

**చట్టం, స్టేట్ బ్యూరో:**

గత వానకాలం సీజన్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం 167.75 లక్షల ఎకరాల్లో, పశ్చిమ బెంగాల్ 105.66 లక్షల ఎకరాల్లో, తెలంగాణ 69.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 42.67 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, తమిళనాడులో 18.53 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి వేశారు. యాసంగి సీజన్‌లో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు చాలా తక్కువ విస్తీర్ణంలో వరిని సాగు చేసినప్పటికీ తెలంగాణలో మాత్రం గణనీయంగా 59.90 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. తెలంగాణలో రెండు సీజన్లు కలిపి మొత్తంగా 129.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో అత్యధిక వరి సాగు చేస్తున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంటే, తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. దిగుబడి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోళ్ల అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిత్యం వివాదాస్పదంగా మారుతోంది. పండిన ప్రతి గింజను కొనుగోలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడుతుండటం కేంద్రానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. వరి సాగును



విపరీతంగా పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఆర్థిక భారం పెరగడమే తప్ప రైతుకు అంతగా ప్రయోజనం ఉండటం లేదని కేంద్ర వ్యవసాయ శాఖ వాదిస్తోంది. వరి సాగు కోసం భారీగా భూగర్భ జల వనరులను వినియోగించడం, విచ్చలవిడిగా ఉచిత విద్యుత్ వాడకం, కనీస మద్దతు ధర అమలు భారమై కూర్చున్నాయి. నిత్యం జలాలను మడులకు పారించాల్సి ఉండటం వల్ల వనరుల దుర్వినియోగం జరుగుతోందని, నీటి పారకం లేకుంటే పంట ఎండిపోయే ప్రమాదం ఉంటుందని కేంద్రం ఆందోళన చెందుతోంది. ఈ సమస్యలన్నింటిని పరిగణనలోకి తీసుకుని నీతి ఆయోగ్ రాష్ట్రాల వారీగా లోతైన విశ్లేషణ చేసింది. వరి సాగు పెరగడం వల్ల తలెత్తుతున్న సమస్యలు, ప్రభుత్వాలపై పడుతున్న ఆర్థిక భారం, దిగుబడి తర్వాత కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులను బేరీజు వేసింది. బోనస్ ప్రకటించడం వల్ల రాష్ట్రాల ఖజానాపై అదనపు భారం పడుతుందనేది నీతి ఆయోగ్ అభిప్రాయం. సాగునీరు, విద్యుత్, ఎరువులు, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మద్దతు ధర వంటి అంశాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, నీతి ఆయోగ్ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వరి నుంచి రైతులను మళ్లించడం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించగలమని నీతి ఆయోగ్ భావిస్తోంది. 2026 27 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్ల పాటు ప్రతి ఏడాది ఐదు లక్షల ఎకరాల చొప్పున వరి సాగు తగ్గించాలని నీతి ఆయోగ్ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ లక్ష్యాన్ని ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని సూచించింది. కేవలం సాగు తగ్గించడమే కాకుండా ప్రత్యామ్నాయ

**వరి సాగు తగ్గింపుపై కేంద్రం, నీతి ఆయోగ్ జారీ చేసిన తాజా ఆదేశాలు రాష్ట్ర రైతాంగంలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వరి వేస్తే ఉరేననే ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ప్రతి ఏడాది ఐదు లక్షల ఎకరాల చొప్పున వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలని తెలంగాణ సహా ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు కేంద్రం స్పష్టమైన హుకుం జారీ చేసింది. ఈ నిర్ణయం అమలులో భాగంగా ప్రతి ఏడాది ఐదు లక్షల ఎకరాల్లో వరి సాగును పూర్తిగా నిలిపివేసి ఆ స్థానంలో లాభసాటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలనేది కేంద్రం ఉద్దేశ్యం. అయితే ఈ కీలక ఆదేశాలను ప్రజలకు స్పష్టం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఇప్పటివరకు బహిర్గతం చేయకుండా కేవలం పంట మార్పిడి పేరుతో సన్నాయి నొక్కులు నొక్కుతూ రైతులను మరింత అయోమయంలోకి నెట్టివేస్తోంది. దేశంలో వరి సాగు గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది.**

పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొంది. వరి కంటే తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పండే ఇతర పంటలను ఎంచుకుంటే రైతుకు అధిక ఆదాయం లభిస్తుందని, ప్రభుత్వాలపై భారం తగ్గుతుందని నీతి ఆయోగ్ అంచనా వేసింది. కానీ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ ఆదేశాలను రైతులకు అర్థమయ్యేలా వివరించడంలో పూర్తిగా విఫలమైంది. అసలు విషయాన్ని దాచిపెట్టడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఇటు రైతులకు, అటు తన ప్రతిష్టకు నష్టం చేకూర్చుకుంటోంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**విప్ ఆది శ్రీనివాస్**

**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 11, 24 వార్డుల్లో నిర్వహించిన ప్రత్యేక వార్డు సభల్లో, వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సభల్లో వర్షాకాల ముందస్తు చర్యలు, జల సంరక్షణ, వనమహోత్సవం, సురక్షిత తాగునీరు, వ్యవసాయ రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల భద్రత, వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, భరోసా కేంద్రాల సేవలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై పూర్తి అవగాహన కల్పించడమే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లక్ష్యమని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని, ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

**ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం**

దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టిన తర్వాత కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణన కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో బేస్‌మెంట్ లేదా గోడలు నిర్మించుకున్న వారికి కూడా సహాయం అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

**రైతు సంక్షేమానికి ప్రాధాన్యం**

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆది శ్రీనివాస్ అన్నారు. రైతులు పంటల సాగుకు ముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి ప్రణాళికాబద్ధంగా సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు వంటి లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. పంటల మార్పిడి ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. జగిత్యాల జిల్లా పొలస తరహాలో మర్రిపల్లిలో 40 ఎకరాల్లో వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా రైతులకు గణనీయమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.




**రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లు**

వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆలయాన్ని మరో వెయ్యి సంవత్సరాలు నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఈ పథకం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. త్వరలో రెండో దశలో మరిన్ని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, కమిషనర్ లోకేష్, డీఎస్పీ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీరాజం, మల్లారం సర్పంచ్ అర్పిత రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# రూ.106 కోట్ల జాకోర–చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభం

**సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**చట్టం న్యూస్ – మోస్రా :**

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం జాకోర గ్రామంలో రైతాంగ సంక్షేమం, సాగునీటి విస్తరణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జాకోర-చందూర్ ఎత్తిపోతల పథకాలను బుధవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. రూ.106 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ పథకాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం రూ.120 కోట్లతో నిర్మాణంలో ఉన్న సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఇరిగేషన్ అండ్ సీఏడీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు. మంత్రి రాక సందర్భంగా జాకోర ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. మహిళలు పూల వర్షం కురిపించగా, కార్యకర్తల నినాదాలతో ప్రాంతం మార్మోగింది.

**ప్రాజెక్టు పనులపై సమీక్ష**

సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి పనుల పురోగతి, నిర్మాణ నాణ్యత, పనుల వేగం, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎత్తిపోతల సంస్థ చైర్మన్ పెంటారెడ్డి, ఈఎన్‌సీ శ్రీనివాస్, ఇరిగేషన్ జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి జిల్లా ఎస్పీ మరియు నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర, జాయింట్ కలెక్టర్ భుజంగరావు, ఇరిగేషన్ సీఈ ప్రమీల, ఇరిగేషన్ సీఈ శ్రీదేవి, బోధన్ ఆర్డీవో విజయలక్ష్మి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**రైతులకు వరంగా నిలవనున్న ప్రాజెక్టులు**

జాకోర-చందూర్ ఎత్తిపోతల పథకాలు, సిద్ధాపూర్ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త ఊపు లభించనుంది. రైతుల ఆదాయం పెరగడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయని అధికారులు తెలిపారు.

# పల్లె కథల పెద్దాయన ఇక లేరు

- సినీ దిగ్గజం భారతీరాజా (86) ఇక లేరు
- పల్లెటూరి కథలను వెండితెరపై ఆవిష్కరించిన దర్శకుడు
- 'సీతాకోకచిలుక' వంటి అద్భుత చిత్రాల సృష్టికర్త
- అగ్ర దర్శకుడిగా, నటుడిగా సుదీర్ఘ ప్రస్థానం
- కుమారుని మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన తండ్రి
- భారతీయ సినీ చరిత్రలో నిలిచిపోయే గొప్ప కళాకారుడు

**చట్టం, స్టేట్ బ్యూరో:**

దక్షిణాది సినీ యవనికపై ఒక ధ్రువతార రాలిపోయింది. గ్రామీణ సౌందర్యాన్ని, సహజ సిద్ధమైన భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించి, నాలుగు దశాబ్దాల పాటు కోట్లాది మంది ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన అపర మేధావి, ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీరాజా కన్నుమూశారు. ఎనభై ఆరు ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడవడం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు తీరని లోటుగా మారింది. గత కొంత కాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఆయన, చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన మరణవార్త తెలియగానే తమిళనాడుతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక గొప్ప కళాకారుడు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన సృష్టించిన అద్భుతమైన దృశ్యకావ్యాలు చిరకాలం సజీవంగా ఉంటాయి. వెయ్యికి పైగా నటీనటులు, సాంకేతిక నిపుణులను సినీ రంగానికి పరిచయం చేసిన ఘనత ఆయన సొంతం. పందొమ్మిది వందల డెబ్బై ఏడులో విడుదలైన పదహారేళ్ల వయసు చిత్రంతో దర్శకుడిగా అడుగు పెట్టిన ఆయన, తొలి ప్రయత్నంలోనే సంచలనం సృష్టించారు. అప్పటివరకు ఉన్న



కమర్షియల్ ఫార్ములాను పక్కనపెట్టి, పల్లెటూరి మట్టి వాసనను, మనుషుల మధ్య ఉండే స్వచ్ఛమైన బంధాలను తెరపై చూపించడం అప్పట్లో ఒక విప్లవం. ఆ చిత్రం దాదాపు మూడు వందల రోజుల పాటు విజయవంతంగా ప్రదర్శితమై రికార్డు సృష్టించింది. కేవలం సాంకేతిక విలువలకే పరిమితం కాకుండా, కథలోని ఆత్మను పట్టుకోవడంలో ఆయన చూపిన ప్రతిభ అమోఘం. ఆ తర్వాత వచ్చిన చిత్రాలు సైతం దశాబ్దాల కాలం గడిచినా నేటికీ క్లాసిక్స్‌గా నిలుస్తూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. తెలుగు సినీ ప్రేక్షకులకు భారతీరాజా ఒక ఆత్మీయుడు. ఆయన దర్శకత్వంలో వచ్చిన సీతాకోకచిలుక, ఆరాధన వంటి చిత్రాలు తెలుగు చలనచిత్ర చరిత్రలో ప్రత్యేక అధ్యాయాలుగా నిలిచిపోయాయి. భాషతో సంబంధం లేకుండా మనుషుల భావాలు ఒకటేనని ఆయన తన సినిమాల ద్వారా నిరూపించారు.

యాభైకి పైగా సినిమాలను విభిన్న శైలుల్లో తెరకెక్కించిన ఆయన, ప్రతి చిత్రంలోనూ ఏదో ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. ఎర్ర గులాబీలు, జమదగ్ని, కొత్త జీవితాలు వంటి చిత్రాలు నేటికీ ఎంతో మంది దర్శకులకు పాఠాలుగా మారుతున్నాయి. ప్రేక్షకుల నాడిని పట్టుకోవడంలో, వారిని భావోద్వేగాల ప్రవాహంలో ముంచెత్తడంలో భారతీరాజాకు ఆయనే సాటి. తెలుగు, తమిళ భాషల మధ్య వారధిగా నిలిచి, రెండు పరిశ్రమలను తనదైన శైలిలో ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది. నటనారంగంలో కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. కేవలం కెమెరా వెనుక ఉండి దర్శకత్వం వహించడమే కాకుండా, కెమెరా ముందు నటుడిగా కూడా ఆయన అద్భుతాలు చేశారు. అనేక తమిళ చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు విమర్శకుల ప్రశంసలను అందుకున్నాయి. చివరిగా ఆయన నటించిన చిత్రాలు ఆయనలోని నటుడిని మరో మెట్టు పైకి తీసుకెళ్లాయి. దర్శకుడిగా మీండుం ఒరు మరియాద్దై చిత్రంతో ముగింపు పలికినప్పటికీ, నటుడిగా మాత్రం ఆయన నిరంతరం బిజీగానే ఉండేవారు. ఒక కళాకారుడిగా ఆయన ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. తను నమ్మిన కథల కోసం, పాత్రల కోసం ఆయన పడిన తపన ప్రతిభావంతుడైన ఒక దర్శకుడికి ఉండాల్సిన అంకితభావానికి నిదర్శనం. ఆయన వ్యక్తిగత జీవితంలో గత ఏడాది సంభవించిన విషాదం, ఆయనను మానసికంగా చాలా బలహీనపరిచింది. తన కళ్లముందే ఏకైక కుమారుడు మనోజ్ భారతీరాజా మరణించడం ఆయనను కోలుకోలేని దెబ్బ తీసింది. ఒక తండ్రికి అంతకంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదని చెప్పవచ్చు. కుమారుడిని కోల్పోయిన బాధను దిగమింగుకుంటూ, ఆ విషాద సాగరం నుండి బయటపడటానికి ఆయన ప్రయత్నించారు. కొంతకాలం కుటుంబ సభ్యులతో విదేశాల్లో గడిపినప్పటికీ, మనసులో గూడు కట్టుకున్న ఆ వేదన ఆయన ఆరోగ్య పరిస్థితిని మరింత దిగజార్చింది.

## మోడీజీ సంపూర్ణ ఆరోగ్యాంగా ఉండాలి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గల శ్రీ నాగ లింగేశ్వర ఆలయంలో బుధవారం రోజు నేటి రోజుతో నరేంద్ర మోడీజీ భారత ప్రధానిగా అత్యధిక రోజులు భారత ప్రధానిగా పరి పాలించిన శుభ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు కలిగోట గంగాధర్, ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మోడీజీ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, భారత ప్రజలకు మరింత సేవాలు చేసే విధంగా మోడీజీ కి శక్తి నివ్వాలని శ్రీ నాగ లింగేశ్వర స్వామిని కోరడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ మోడీజీ భారత ప్రధానిగా నేటి రోజుతో 4399 రోజులు పూర్తి చేసుకున్నారన్నారు. అత్యధిక రోజులు భారత ప్రధానిగా సేవాలు అందించే అవకాశం ప్రజల ఆశీర్వాదంతో ఘనత సాధించారన్నారు. భారత ప్రధానిగా గతంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రు, 4398 రోజులతో అత్యధిక రోజులు ప్రధాన మంత్రిగా ఉన్నారని, నేటితో మోడీజీ 4399 రోజులు ప్రధానిగా పూర్తి చేసుకొని అత్యధిక రోజులు భారత ప్రధానిగా సేవలన్దిచే భాగ్యం ప్రజల ఆశీర్వాదంతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఎలాంటి సెలవులు తీసుకోకుండా నిరంతరం భారత ప్రజలకు సేవలు అందిస్తున్నారని, అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజా సంక్షేమం, దేశ భద్రత, అవినీతి రహిత పాలన, వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. బీజేపీ, ఎన్డీఏ పక్షలను ఆశీర్వాదిస్తున్న ప్రజలకు నా ప్రత్యేక ధన్యవాదములు అని అన్నారు. మోడీజీ సంపూర్ణ ఆరోగ్యాంగా ఉండాలని పూజలో పాల్గొన్న ఆలయ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పూజ అనంతరం నాయకులు మోడీజీ నాయకత్వం వర్ధిల్లాలి అని, లాంగ్ లివ్ మోడీజీ అని నినాదాలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో గజవాడ రాజయ్య, నారాయణ, శ్యామ్ సుందర్, అజయ్, అజంతా శ్రీనివాస్, రూపేష్, రమేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందాలి



**చట్టం ఆర్మూర్:** ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగేష్ శర్మ గురుస్వామి అన్నారు. బుధవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జంబి హనుమాన్ ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ బుధవారం మాస పూజా కార్యక్రమానికి ఆయన హాజరై అయ్యప్ప ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం వితరణ కార్యక్రమానికి ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుస్వామి నగేష్ శర్మ మాట్లాడుతూ, ప్రతినెల 2వ బుధవారం అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని, ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెరగాలని ఆయన అన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. అన్న ప్రసాదం కార్యక్రమానికి పూర్తి ఖర్చులు భరించిన ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులకు అయ్యప్ప కరుణ కటాక్షాలు ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు పుట్టి మురళి, మీసాల రవి, కోశాధికారి గాజారెడ్డి నర్సారెడ్డి, సహాయ కోశాధికారి షేర్ ఒడ్డెన్న, పెంట జలంధర్, జనార్దన్ గౌడ్, పోల సుధాకర్, మసాల సత్యనారాయణ, బాలాజీ గంగామోహన్, జంబి హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రేగుళ్ల సత్యనారాయణ, డైరెక్టర్ నూతుల నారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు సడక్ వినోద్, నర్మే నవీన్, భూపేందర్, గంగూలీ, బొప్పెన ప్రసాద్, కలిగోట గంగాధర్, నూతల శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, దత్తు గురుస్వామి, పూల నర్సయ్య, అశోక్, ఉదయ్, శ్రీహరి, మీసాల రాజేశ్వర్, పూజ నరేందర్, నందు, పూల ప్రసాద్, గంగాధర్ గౌడ్, రవి, నోముల నవీన్ రెడ్డి, కౌటిక విజయ్, లీడర్ శీను, గంగాధర్, శుభం, నవీన్, మహేష్ మోటార్స్ మహేష్, నరేష్, వరుణ్, అయ్యప్ప స్వాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలం బుధవారం రోజు కందార్‌పల్లి గ్రామానికి చెందిన కురుకుటే ఈశ్వర్ (50 సంవత్సరాలు) ఉరివేసుకుని మృతి చెందినట్లు సమాచారం అందడంతో దరఖాస్తు స్వీకరించబడింది. ప్రాథమిక విచారణలో తెలిసిన వివరాల ప్రకారం, మృతుడికి భార్య కుర్కుటే పింకీబాయి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు మద్యం సేవించి తరచూ ఇంట్లో గొడవపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ రోజు కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య కుర్కుటే పింకీబాయితో గొడవపడ్డాడు. అనంతరం ఆమె ఇంటి బయటకు వెళ్లింది. తిరిగి మధ్యాహ్నం సుమారు 2:50 గంటలకు ఇంటికి వచ్చి చూడగా, మృతుడు ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నాము .

## ఆట యూత్ కాన్ఫరెన్స్ కు ట్రస్మా జిల్లా అధ్యక్షుడికి ఆహ్వానం

**ఆర్మూర్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భాషిత సుందర్‌కు ఘన సన్మానం**



**చట్టం ఆర్మూర్:** అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆట) జులై 31 నుంచి ఆగస్టు రెండు వరకు నిర్వహించబోయే యూత్ కాన్ఫరెన్స్, ఎడ్యుకేషనల్ సెమినార్ కు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు భాషిత సుందర్ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్మూర్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ తరపున బుధవారం రోజు నలంద హై స్కూల్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆర్మూర్ వాస్తవ్యులు శ్రీభాషత కరస్పాండెంట్, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా అధ్యక్షుడు సుందర్ సార్ కు ఆట తరపున ఆహ్వానం రావడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్మక్రమంలో పాల్గొని, వారి యొక్క విలువైన సందేశం ఇవ్వాల్సిందిగా ఆటవారు సుందర్ ను కోరడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భారత్ చంద్ర మల్లయ్య, విద్య ప్రవీణ్ పవార్, రాష్ట్ర నాయకులు కాంతి గంగారెడ్డి, మానస గణేష్, మాజీ మండల అధ్యక్షులు నలంద ప్రసాద్, విద్య గోపి కృష్ణ, కోశాధికారి స్కాలర్స్ వేణు, సెయింట్ పాల్ బబ్లూ, జెంటిల్ కిడ్స్ ప్రకాష్, లిల్లీ పుట్ రామక్రిష్ణ, శ్రీమోడల్ మల్లేష్, సిద్దార్థ గంగారెడ్డి , నలంద సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ



**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా వ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ, జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను పక్కనపెట్టి పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, బూట్లు, టైలు, బెల్టులు తదితర విద్యా సామగ్రిని విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. విద్యాసంస్థలను సేవా సంస్థలుగా కాకుండా వ్యాపార సంస్థలుగా మార్చి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పాఠశాల యాజమాన్యాల వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ కోరింది.

# మానవత్వమే పెట్టుబడిగా...₹ 20లకే టిఫిన్, ₹ 40లకే కడుపునిండా భోజనం..!

## ఆశ్రయ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "ఎస్ వి ఎస్ ఫుడ్ కోర్ట్" ద్వారా అద్భుత సేవలు

### రూపాయి లాభం ఆశించకుండా సాగుతున్న సేవా యజ్ఞం






**చట్టం న్యూస్ ప్రత్యేక కథనం**

**చట్టం రామకృష్ణాపూర్ (మంచిర్యాల):** "మానవ సేవయే మాధవ సేవ" అనే నినాదాన్ని అక్షరాలా నిజం చేస్తోంది "ఆశ్రయ వెల్ఫేర్ ట్రస్ట్" నేటి రోజుల్లో కాస్త నాణ్యమైన టిఫిన్ చేయాలన్నా, ఒక పూట కడుపు నిండా తినాలన్నా వందల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ తరుణంలో... సామాన్యులు రోజువారీ కూలీలు, నిరుపేదల ఆకలి బాధలను గుర్తిస్తూ, లాభాపేక్ష లేకుండా కేవలం 100/ రూపాయలకే మూడు పూటలా నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రం, మార్కెట్ రోడ్ లో ఉన్న SVS షాపింగ్ మాల్ సౌజన్యంతో 'ఎస్ వి ఎస్ ఫుడ్ కోర్ట్" ద్వారా అందిస్తూ ఈ ట్రస్ట్ సమాజంలో సరికొత్త ఆదర్శాన్ని నిలుపుతోంది.

**₹100 లకే రోజంతా కడుపు నిండా**

మంచిర్యాల జిల్లా కేంద్రానికి ఎంతోమంది వివిధ వర్గాల ప్రజలు...వారి స్వంత పనుల నిమిత్తం మంచిర్యాలకు వస్తూ పోతూ ఉంటారు. అంతేకాక వివిధ షాపుల్లో, ఇతరత్రా పనులు చేసేందుకు ఈ ప్రాంతానికి ఎక్కువగా వస్తూ ఉంటారు. ఉచితంగా పంపిణీ చేస్తే సరిపోలేమని తక్కువ ధరలో మంచి ఆహారం తినాలనే సంకల్పంతో " ఉదయం రెండు రకాల టిఫిన్, మధ్యాహ్నం మంచి భోజనం, సాయంత్రం వెజ్ బిర్యానీ, సామాన్య ప్రజలకు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో "ఎస్ వి ఎస్ ఫుడ్ కోర్ట్" లో అతి తక్కువ ధరలను సామాన్యుడికి అందుబాటులో ఉంచారు. ఒక మనిషి రోజు మొత్తంలో కేవలం ₹100/ లోపే నాణ్యమైన ఆహారంతో కడుపు నింపుకోవాలనేదే తమ ప్రధాన ఆశయమని సందీప్ అగర్వాల్ తెలిపారు.

**₹20 రూపాయలకే క్వాలిటీ టిఫిన్, 40/- రూపాయలకే మంచి రుచికరమైన భోజనం**

ప్రతిరోజూ ఉదయం 8 నుండి 10 గంటల వరకు ఎంతో రుచికరమైన నాణ్యమైన ఇడ్లీలను, బొండాలను కేవలం ₹20/ రూపాయలకే అందిస్తున్నారు. ఉదయం మాత్రమే కాకుండా, మధ్యాహ్నం 1 నుండి 4 గంటల వరకు మంచి రుచికరమైన భోజనం ఒక కర్రీ, సాంబార్, చట్నీ, పెరుగు మొత్తం నాలుగు రకాల పదార్థాలతో 40/ రూపాయలకే తిన్నంత భోజనాన్ని అందిస్తున్నారు. సాయంత్రం 6 నుండి 9 గంటల వరకు ₹40 రూపాయలకే వెజ్ బిర్యానీ, 20/ రూపాయలకే ప్లేట్ ఇడ్లీలను అందిస్తూ.. సామాన్య ప్రజల ఆకలిని పారదోలేందుకు ఇంతటి సేవా దృక్పథంతో ముందు కొచ్చిన ఆశ్రయ వెల్ఫేర్ ట్రస్ట్ "ఎస్ వి ఎస్ ఫుడ్ కోర్ట్" నిర్వాహకుల ప్రయత్నాన్ని జిల్లా ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఏడేళ్ల సంకల్పం.. మిత్రుల మద్దతు..!

ఈ అద్భుత సేవా కార్యక్రమం వెనుక గతంలో జై శ్యామ్ టెక్స్ టైల్స్, ఫ్యాషన్ హౌస్, ప్రస్తుతం మార్కెట్ రోడ్ లో SVS షాపింగ్ మాల్ నిర్వహిస్తున్న యాజమాని, అ ట్రస్ట్ ఫౌండర్ సందీప్ అగర్వాల్ ఏడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ, పట్టుదల దాగి ఉన్నాయి. 2017 లోనే సమాజానికి తక్కువ ధరలో మంచి భోజనం అందించాలనే సంకల్పంతో ఆయన ముందుగా వంట పాత్రలు, ఇతర సామాగ్రిని కొనుగోలు చేశారు. అయితే, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సమయంలో ఈ ట్రస్ట్ ప్రారంభం కాలేకపోయింది. అయినప్పటికీ, తన సేవా సంకల్పాన్ని ఆయన వదులుకోలేదు. ఎదురుదెబ్బలు తగిలినా వెనకడుగు వేయని సందీప్ అగర్వాల్‌కు 2024లో మళ్లీ మోక్షం లభించింది. ఆయన మిత్రుడు సందేష్ గుప్తా అందించిన అండదండలతో, మంచి వంట మనుషుల సహకారంతో ఈ భోజన, టిఫిన్ వితరణ కార్యక్రమం ఎట్టకేలకు పట్టాలెక్కింది. వారి గురువు గారైన "కార్తీక మహా రాజ్"స్వామి ఆశీస్సులతో ఈ సేవా యజ్ఞం దిగ్విజయంగా ప్రారంభమైంది.

### సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరలకు కడుపు నింపుతున్నాడు



నేను ప్రతిరోజు మంచిర్యాలకు పెయింటింగ్ పనులు నిర్వహించేందుకు వస్తూ ఉంటాను. నాకు రోజు వారి కూలి 600 రూపాయలు వస్తాయి. ప్రతిరోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఇక్కడే చేస్తాను. కేవలం ప్రతిరోజు 60 రూపాయలు మాత్రమే ఖర్చు అవుతున్నాయి. మాలాంటి సామాన్య ప్రజలకు మంచి రుచికరమైన టిఫిన్, మంచి నాణ్యమైన భోజనం మొత్తం కలిపి 60 రూపాయలకే అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో సామాన్య ప్రజల కడుపు నింపడం చాలా గొప్ప విశేషం అన్నారు. ఇలాంటి సేవలను అందించడం అరుదుగా కొంతమందికే సాధ్యపడుతుందని, వారికి మా ప్రత్యేక సామాన్య ప్రజల ధన్యవాదాలు అని తెలిపారు. వారు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

_పెయింటర్ గండి రమేష్

### ఇంటి వంట లాంటి మంచి నాణ్యత భోజనం అందిస్తున్నాం



ఆశ్రమ ట్రస్ట్ ఫౌండర్ సందీప్ అగర్వాల్ ను "చట్టం న్యూస్" ప్రత్యేకంగా పలకరించగా "ధర తక్కువైనా క్వాలిటీ విషయంలో తాము ఎక్కడా రాజీ పడటం లేదు. ప్రతి ఒక్కరికీ తమ ఇంట్లో తినే భోజనం లాంటి అనుభూతిని, ఆరోగ్యాన్ని అందించడమే మా ఆశ్రయ వెల్ఫేర్ ట్రస్ట్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. మా గురువు గారి ఆశీస్సులతో ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించాం. మా వస్త్ర వ్యాపారంలో వచ్చే లాభంతో, సామాన్య ప్రజల ఆకలి తీర్చాలని సంకల్పంతో ఎలాంటి లాభాపేక్ష లేకుండా మా 'ఎస్ వి ఎస్ ఫుడ్ కోర్ట్' ద్వారా పూర్తిగా సమాజ సేవకే ఉపయోగించాలనుకుంటున్నాం. భవిష్యత్తులో వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, అలాగే ఉచిత వైద్యం అందించేందుకు హాస్పిటల్స్ వంటివి ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలిపారు. సమాజ సేవ చేయడానికి మేము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నాం. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి మాకు సపోర్ట్ చేయాలనుకుంటే ఆహ్వానిస్తున్నామని వ్యక్తం చేశారు. ప్రస్తుత స్వార్థ సమాజంలో రూపాయి లాభం లేనిదే ఏ పనీ చేయడం లేదన్నారు.

– ట్రస్ట్ ఫౌండర్ సందీప్ అగర్వాల్

## ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యం

**బోధన్‌లో ఘనంగా 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభ**

**చట్టం, బోధన్ :**

బోధన్ పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కళ్యాణ మండపంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా 31వ వార్డు నుంచి 38వ వార్డుల వరకు సంయుక్త వార్డు సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, ఆరోగ్యం, ఓటర్ల జాబితా సవరణ, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ (ఏసీ ఎల్‌బీ) భుజంగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, బోధన్ టౌన్ ఎస్ఐ హబీబ్ ఖాన్, మున్సిపల్ మేనేజర్ రమేష్, మండల ఆర్ఐ శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, మెప్మా పట్టణ సమన్వయకర్త శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. అడిషనల్ కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు వార్డు సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా డెంగీ, మలేరియా, కలరా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివరిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, బీమా పథకాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టౌన్ ఎస్ఐ హబీబ్ ఖాన్ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని హెచ్చరించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో వస్తున్న మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా శాంతిభద్రతలు మెరుగుపడతాయని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ మాట్లాడుతూ వార్డు సభల్లో వచ్చిన సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందన్నారు. పట్టణంలో పారిశుధ్యం, డ్రైనేజీ శుభ్రత, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి సేవలను సమర్థవంతంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో బోధన్‌ను పరిశుభ్రమైన, చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభలు




**చట్టం రామాయంపేట :** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ పరిధిలోని గొల్లర్తి గ్రామంలో 1, 6, 7 వార్డులకు సంబంధించిన వార్డు సభలు నిర్వహించారు. సభలో గ్రామ ప్రజలు తమ ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలను ప్రాధాన్యంగా ప్రస్తావించారు. అలాగే తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు తెలిపారు. స్థానిక అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేత్రదానం మహాదానం.. ఇద్దరికి వెలుగునిచ్చే అమూల్య కానుక

**ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రిలో నేత్రదాన ప్రతిజ్ఞ**



**చట్టం, బోధన్ :** ప్రపంచ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, సిబ్బంది నేత్రదాన ప్రతిజ్ఞ చేసి సమాజంలో అవగాహన పెంపొందించేందుకు సంకల్పించారు. ఈ సందర్భంగా లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు, లయన్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ పోలవరపు బసవేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయాలని పిలుపునిచ్చారు. ఒక నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానం సమయంలో కంటిని పూర్తిగా తొలగించరని, కంటి నల్లగుడ్డులోని కార్నియాను మాత్రమే సేకరిస్తారని వివరించారు. నేత్రదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు యార్లగడ్డ శ్రీనివాస్, కొడాలి కిషోర్, ఉమేష్ షిండే, నేత్ర వైద్యులు డాక్టర్ మనీష్ కుమార్, డాక్టర్ ఓంనా రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం నేత్రదానం ప్రాముఖ్యతను ప్రజలకు చాటి చెప్పడంలో విశేషంగా దోహదపడింది.

# ఘనంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన సదస్సు




- ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం
- వాహనదారులకు హెల్మెట్లు, మెడికల్ కిట్ల పంపిణీ

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :**

సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రత అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీజీపీ శిఖా గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో రహదారి భద్రతపై అవగాహన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం 'కనువిప్పు' బృందం ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా ప్రమాణాలు, ఉల్లంఘనలపై చైతన్య గీతాలను ఆలపించి సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీజీపీ ప్రారంభించారు.

**రాష్ట్రంలో ఏటా 8 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి**

ఈ సందర్భంగా డీజీపీ శిఖా గోయల్ మాట్లాడుతూ, సమాజంలో జరిగే నేరాల కంటే రహదారి ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ఏడాదికి సగటున 800 హత్యలు నమోదవుతుంటే, దాదాపు 8 వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. ఇందులో అత్యధిక ప్రమాదాలు గ్రామీణ ప్రాంతాల రహదారులపైనే జరుగుతున్నాయి. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడుతున్నాయి. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం అత్యంత ప్రమాదకరం. సురక్షితంగా ప్రయాణించి, సురక్షితంగా గమ్యం చేరడమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి" అని అన్నారు. సదస్సులో ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహించిన డీజీపీ, హెల్మెట్ ధరించడమే కాకుండా దాని స్ట్రాప్‌ను తప్పనిసరిగా లాక్ చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఉచిత కంటి అద్దాలు, మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందజేశారు.

**ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత**

జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహించినట్లు తెలిపారు. "గ్రామ సభల్లో ప్రత్యేక భద్రతా కమిటీలను ఏర్పాటు చేశాం. రహదారిపై ప్రమాదం జరిగినప్పుడు వీడియోలు తీయడంలో సమయం వృథా చేయకుండా వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలి. బాధితులకు మానవత్వంతో సహాయం చేయాలి. అవసరమైతే సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడే బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలి. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం" అని పేర్కొన్నారు.

**ప్రజల భద్రత అందరి ఉమ్మడి బాధ్యత**

పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో సామాజిక అవగాహన కల్పించడం కూడా పోలీసుల బాధ్యత అని అన్నారు. ఇటీవల మిట్టపల్లి వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని కారు ఢీకొట్టిన ఘటనను ప్రస్తావిస్తూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డుపై ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోతే ఎలా ప్రాథమిక చికిత్స అందించాలి, సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలను సదస్సులో ప్రాక్టికల్‌గా ప్రదర్శించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ అవగాహన ప్రాణాలను కాపాడగలదన్నారు. ప్రజల ప్రాణాలు అమూల్యమైనవని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సిద్దిపేట జిల్లాను ప్రమాద రహిత, చలాన్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై వార్డు సభలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** 38వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్ధ్య నిర్వహణ మరియు వర్షాకాల ముందస్తు చర్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. సభలో వార్డులో పారిశుద్ధ్య నిర్వహణను సమర్థవంతంగా కొనసాగిస్తూ ప్రతిరోజూ తమ విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తున్న శానిటేషన్ వర్కర్ల సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రమైన వాతావరణ పరిరక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, వారి సేవలకు సభ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులోని మహిళలు, స్థానిక ప్రజలు వీధి కుక్కలు మరియు కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని సభ దృష్టికి తీసుకువచ్చారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యను అత్యవసరంగా పరిగణించి సంబంధిత శాఖల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ఫాగింగ్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, నిల్వ నీరు ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం శుభ్రపరచి మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే ప్రధాన లక్ష్యమని, ప్రజల సహకారంతో వార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని సభలో హామీ ఇచ్చారు. సభలో వార్డు ప్రజలు, మహిళలు, శానిటేషన్ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దుబ్బాక శాఖ నగర కార్యదర్శిగా మరోసారి శేర్ల జేశ్వంత్ ఎన్నిక




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ దుబ్బాక శాఖ ఆధ్వర్యంలో స్థానిక దిశా స్కూల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ & మెదక్ విభాగ్ (ఉమ్మడి జిల్లా) కన్వీనర్ సావుల ఆదిత్య పాల్గొని గత 77 ఏళ్లగా ఏబీవీపీ దేశ సేవలో బాగంగా జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా సమాజ సేవ చేస్తున్న విషయాన్ని గుర్తుచేస్తూ కార్యకర్తలను ఉద్దేశించి మనమంతా జాతీయ భావాలతో దేశానికి సేవ చేస్తూ విద్యారంగ సమస్యలను పరిష్కరించుటకై కృషి చేయాలని దిశా నిర్దేశం చేసిన అనంతరం నూతన నగర కమిటీని ప్రకటించడం జరిగింది అందులో భాగంగా దుబ్బాక నగర కార్యదర్శిగా మరోసారి శేర్ల జేశ్వంత్, నగర ఉపాధ్యక్షులుగా కుమార్, పవన్, సంయుక్త కార్యదర్శిగా సాయితేజ, రాజు, మహిళ కన్వీనర్ గా అఖిల, ఎస్ ఎఫ్ డి కన్వీనర్ గా అరవింద్, ఎస్ ఎఫ్ డి కో కన్వీనర్ గా సుమంత్, ఎస్ ఎఫ్ ఎస్ కన్వీనర్ గా శ్రీకాంత్, ఎస్ ఎఫ్ ఎస్ కో కన్వీనర్ గా దిశాంత్, ఖేల్ కన్వీనర్ గా తరుణ్ ని ప్రకటించారు. ఈ సమావేశంలో కార్తీక్ ,ప్రశాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన:గ్రామ సభ నిర్వహించి సమస్యలు తెలుసుకున్న సర్పంచ్



**చట్టం గాంధారి::** గాంధారి మండలం మాతు సంఘం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజా పాలనను ప్రజల వద్దకు వెళ్లి గ్రామ సభను నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ వందనబలవంతరావు తెలిపారు. గ్రామంలో గ్రామ అభివృద్ధి, తాగునీరు ,పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సంక్షేమ పథకాల అమలు వాటి అంశాలపై ప్రజల అభిప్రాయాలు సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని తమ సమస్యలు సూచనలను వెల్లడించారు ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి దామోదర్ రెడ్డి, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నేత అన్నాడి మల్లారెడ్డి మరణం తీరనీలోటు

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ సంతాపం**



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గాగిల్లపుర్ గ్రామానికి చెందిన సిపిఐ సినీయర్ నేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులుగా సుధీర్ఘ కాలం పని చేసిన అన్నాడి మల్లారెడ్డి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు బుధవారం నాడు గాగిల్లపూర్ గ్రామం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. బుధవారం నాడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ సిపిఐ నాయకులతో కలిసి మల్లారెడ్డి భౌతిక కాయానికి పుల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెగంపెట మాజీ సర్పంచ్ పోతిరెడ్డి వెంకటరెడ్డి, బెజ్జంకి మండల సిపిఐ కార్యదర్శి బొనగిరి రూఫేష్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ నాయకులు అయిలేని మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశానంటిన కూరగాయల ధరలు



- కొనలేం..! తినలేం
- బాసర అంగట్లో అన్ని ప్రియమే
- సెంచరీ కి చేరుకున్న టమాటా ధర

**చట్టం, బాసర :**

నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని ప్రతి బుధవారం కొనసాగే వారసంతలు భాగంగా కూరగాయల ధరలు ఒకేసారి తొలగిపోవడంతో ఆకాశాన అంటిన కూరగాయల ధరలు, దీనితో సామాన్య ప్రజలు ముక్కున వేలు వేసుకొని ఇక కూరగాయలు కొనలేం తినలేమంటూ వాపోయారు. ఏకంగా టమాటా ధర కేజీ ₹ 100 పలకడంతో కొందరు సామాన్య ప్రజలు సగం కేజీ కొనటానికి కూడా జంకారు దీనితో కేజీ టమాట కొన్న బదులు ఆఫ్ కేజీ చికెన్ వస్తుందని బుధవారం బాసర అంగట్లో ఏది కొన్నమన్న అన్ని ప్రియమే దీనితో కాకరకాయ, మిర్చి, దొండకాయ, బెండకాయ, పల్లికాయ, వంకాయ, గోపి, లాంటి అన్ని కూరగాయలపై ప్రతిదీ 100 కు పైగా కేజీ ఉండడంతో కొందరు సామాన్య ప్రజలు కొనలేకపోయారు. కేజీ ధర 100 కుంటే ఆఫ్ కేజీ 30 నుండి 50 వరకు పలికింది, తక్కువ రేట్లు మామిడి పండ్లు మాత్రమే దొరకడంతో ఇక పండ్ల రేట్లు రెట్టింపు ధరలు పలకగా ప్రతి కొనుగోలుదారులు ముక్కున వేలు వేసుకొని ఏమి చేయలేకపోయారు, బాసర సంతకు మండల కేంద్రంతో పాటు ప్రసిద్ధ బాసర పుణ్యక్షేత్రం ప్రముఖ ట్రిబుల్ ఐటీ కళాశాల తో పాటు నిజాంబాద్ జిల్లా యాంచ, నందిపేట్ ఫకీరాబాద్ బినోల, తో పాటు బాసర మండల పరిధిలోని, ఓని, కౌట, సాలాపూర్, సావర్గం, సురెల్లి, కిర్గుల్ బి, కిర్గుల్ కే, టాక్లి, దొడపూర్, బిజిరెల్లి, లాబ్ది గ్రామాల నుండి కాకుండా ముధోల్ మండలం, అష్ట,గన్నోరా, గ్రామాల నుండి ద్విచక్ర వాహనాలతో పాటు ప్రత్యేక ఆటోలో సంతకు తరలివస్తారు. ఒకేసారి ఏది కొందమన్న రెట్టింపు రేట్లు పలకడంతో అందరూ విచిత్రంగా ఆలోచించారు. కొందరు నిత్యం కూలి చేసేవారు నామమాత్రపు కూరగాయలు కొని ఇంటికి బయలుదేరగా మరికొందరు ఇదే మీ రేట్లు అంటూ అందరూ అంగడిలో కొనుగోలుదారులు అర్థంకాని స్థితిలో నిలబడి కూరగాయలు వైపే చూస్తూ ఉండిపోయారు. ప్రస్తుతం వికయదారులు మహారాష్ట్ర ప్రాంతం నిజాంబాద్ జిల్లా సుధీర ప్రాంతాల నుండి కూరగాయలు తీసుకురాగా కూరగాయల ధరలను చూసి ప్రతి ఒక్కరు కొనలేని స్థితిలో ఉండిపోయారు. వర్షాకాలం మొదలు కాకముందే కూరగాయల ధరలు ఈ రేట్లు ఉంటే వర్షాకాలంలో ఎలా ఉండాలని కొందరు కొనుగోలుదారులు సంగ్దిదంలో ఉండిపోయారు.

## మోస్రా మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మాముల సాయిలు ఏకగ్రీవ ఎన్నిక



**చట్టం న్యూస్ మోస్రా :**

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని మోస్రా మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా తిమ్మాపూర్ గ్రామ ఉప సర్పంచ్ మాముల సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఫోరం సెక్రటరీగా రూడావత్ సతీష్, కోశాధికారిగా ఈరపురం గంగాధర్ ఎన్నికైనట్లు సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాముల సాయిలుకు నాయకులు, ఉప సర్పంచ్‌లు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా డీసీసీ కార్యదర్శి పిట్ల శ్రీరాములు, మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొతమిర్కర్ లక్ష్మణ్, ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగ సాయిగౌడ్, చింతకుంట, తిమ్మాపూర్, చే నెంబర్ తండా సర్పంచ్లు సీనియర్ నాయకులు బాగా రెడ్డి, సుర సాయిలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అధ్యక్షుడు మాముల సాయిలు మాట్లాడుతూ... మోస్రా మండలంలోని అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌ల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు మాముల సాయిలు తెలిపారు. ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధికి తమ ఫోరం వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని చెప్పారు. ఉప సర్పంచ్‌ల మధ్య ఐక్యతను పెంపొందించి, ప్రభుత్వ సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఫోరం బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.

## నెహ్రూ రికార్డును అధిగమించిన సందర్భంగా మోదీ దీర్ఘాయుష్షు కోసం ప్రత్యేక పూజలు



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రిగా అత్యధిక కాలం పనిచేసిన నాయకుల జాబితాలో జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించిన సందర్భంగా వేములవాడ రూరల్ మండలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలాధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో ఎదురుగట్ల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ పూజా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సుమారు ఆరు దశాబ్దాల తర్వాత నెహ్రూ ప్రధానమంత్రిగా పనిచేసిన 4,398 రోజుల రికార్డును నరేంద్ర మోదీ అధిగమించడం దేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో దేశ ఆర్థికాభివృద్ధి మరింత వేగంగా కొనసాగాలని, ప్రజల సంక్షేమం కోసం మరిన్ని విప్లవాత్మక నిర్ణయాలు తీసుకునే శక్తి కలగాలని ఆకాంక్షించారు. అలాగే మోదీ ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం, ఎదురుగట్ల సర్పంచ్ గడారి సంధ్య తిరుపతి, ఫాజిల్‌నగర్ ఉపసర్పంచ్ పోగుల రాకేష్, మండల ఉపాధ్యక్షుడు గుంటి వంశీకృష్ణ, మండల కార్యదర్శులు చందం కుమార్, మందా రాజేందర్, బూత్ అధ్యక్షులు మారంపల్లి కరుణాకర్, బండ గోపాల్, సీనియర్ నాయకులు సార నర్సయ్య, సామోజీ గౌతమ్, నందగిరి రాహుల్, ఎగుర్ల శ్రీనివాస్, నేరెళ్ల రాజయ్యతో పాటు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ మన దేశానికి ప్రధానిగా దొరకడం గర్వకారణం




**చట్టం నవీపేట్ :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ 4399 రోజులు దేశానికి పరిపాలించి చరిత్ర సృష్టించిన సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప ఆలయంలో బోధన అసెంబ్లీ ఇన్చార్జి వడ్డీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నేటి రోజు గుర్తుండిపోయేగా మొక్కలను నాటారు. ఆలయంలోని గోషాలను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ దొరకడం చాలా గర్వకారణమని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు మోడీ గారు చేస్తున్న సేవలు ఎంతో గొప్ప వని అన్నారు. ప్రపంచ దేశాలలో పోటీ పడుతుంటే దానికి కారణం మోడీ పరిపాలనాని వారి పరిపాలనలో దేశ ప్రజలంతా భయం లేకుండా జీవిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధం నడుపుతున్న కూడా అటువంటి ప్రభావం ఈ దేశం పై పడకుండా సరైన నిర్ణయం తీసుకోవడంలో ఆయన నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి మైసరాద, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ కూరల శ్రీధర్, సర్పంచులు కాంతారావు, సుంకరి రాజు మండల ప్రధాన కార్యదర్శి మంత్రి రాజేందర్ గౌడ్, మీరే డి భూషణ్ సీనియర్ నాయకుడు పుట్టా శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ పునాది నవీన్, ప్రేమ్ సింగ్, గంగోని రాము, రమణారావు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పోశెట్టిపల్లెలో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** వేములవాడ రూరల్ మండల కేంద్రంలోని పోచేట్టిపల్లె గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బోనాలను నెత్తిన మోసుకుంటూ డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ సభ్యులు, యువకులు ఊరేగింపులో పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం, ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా పోచమ్మ బోనాల వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

## నర్కుడ గ్రామసభలో 99 రోజుల ప్రణాళికపై చర్చ




**చట్టం, శంషాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రణాళికలో భాగంగా నర్కుడ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై విస్తృతంగా చర్చించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, హానికర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానం, వాటి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. 99 రోజుల ప్రణాళికను విజయవంతం చేసి నర్కుడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. మహిళా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ నాయకులు తొంట అశోక్, రక్షిత్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మున్ని, మెడికల్ ఆఫీసర్ దివ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉపసర్పంచ్ నీరటి మహేష్, వార్డు సభ్యులు పర్వతం వెంకటయ్య, చౌట రాజు, తొంట జంగమ్మ, కనకమామిడి విష్ణు, కుంచ లత కుమార్ గౌడ్, బుర్కుంట నాగరాజు, పులిమామిడి శాలిని, శ్రీకాంత్ గౌడ్, పర్వతం వినోద్, లింగం సంధ్య, నవీన్, గూడెపు నీరజ, లక్ష్మణ్, కర్రె అఖిల, గణేష్ పాల్గొన్నారు.

## గ్రామంలో నిషేధిత పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

**సావర్గాంలో ప్రజలతో ప్రత్యేక సమావేశం**

**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని సావర్గం గ్రామంలో బుధవారం ఆలివ్ అరివ్ కార్యక్రమంలో భాగంగా బాసర సీఐ దీపక్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర సీఐ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... గ్రామంలో ఎవరైనా నిషేధిత గుట్కా పదార్థాలు అమ్మితే శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అంతేకాకుండా బెల్ట్ షాపు కానీ ఎవరైనా గాంజా విక్రయాలు లాంటి చర్యలకు పాల్పడితే అదే విధంగా ముఖ్యంగా కుటుంబ సభ్యులు మైనార్ లకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ఎంతో ఉందని ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు జరగడానికి దీనికి నిదర్శనం అని అంతే కాకుండా వాహనం నడిపేటప్పుడు శిరస్రానం తొలగించి నడపాలని ప్రతి ఒక్కరు వాహనం యొక్క పరిసరాలు కలిగి ఉండాలని గ్రామంలో ఎవరైనా కొత్తవారు కనబడితే వారిని పట్టుకుని నేరుగా పోలీసులకు అప్పగించాలని, అదేవిధంగా అంటరానితనం కుల బహిష్కరణ లాంటి పై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అందరూ కలిసిమెలిసి ఉండి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి యువత గ్రామస్తులు ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాసర స్థానిక సర్పంచ్, గాదేవార్, ముత్తు బాయి. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## మోదీకి చిత్రం అంకితమిచ్చిన రామకోటి రామరాజు

- 4,399 రోజుల రికార్డ్‌ను అధికమించిన మోదీ
- అవాలతో అద్భుత చిత్రం చిత్రించిన రామకోటి రామరాజు
- 12 సంవత్సరాల మోదీ దేశసేవ చరిత్రాత్మకం




**చట్టం సిద్దిపేట (దుబ్బాక):** 12 సంవత్సరాల దేశ సేవలో ప్రధాని నరేంద్ర మోదీ గారు 4,399 రోజులు పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించిన సందర్భంగా బుధవారం నాడు మోదీ చిత్రాన్ని అవాలతో అద్భుతంగా చిత్రించి రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి మోదీకి అంకితం ఇచ్చారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజుల రికార్డును నేడు అధిగమించి, భారతదేశపు అత్యధిక కాలం 4,399 రోజులు పనిచేసిన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించారన్నారు. ఇది కేవలం రికార్డ్ కాదు ఇది 140 కోట్ల మంది భారతదేశ ప్రజల నమ్మకం అని అన్నారు. 12 ఏళ్లపాటు దేశ సేవలో మన మోదీ సేవలు అమోఘం అన్నారు. గత 30 సంవత్సరాలనుండి ఎన్నో రకాల చిత్రాలను ఎన్నో చిత్రించానన్నారు.

## మౌలిక సదుపాయాల గ్రామ అభివృద్ధే లక్ష్యం

- ముచ్చింతల సర్పంచ్ కత్తుల సుభాష్




**చట్టం, శంషాబాద్:** శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ గ్రామంలో సర్పంచ్ కత్తుల సుభాష్ ఆధ్వర్యంలో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచింది అనంతరం వారు మాట్లాడుతూ... గ్రామంలో వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు, చెత్త బండ్ల నిర్వహణ, మంచినీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, పెన్షన్ల మంజూరు వంటి ప్రజా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. గ్రామానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పారిశుధ్యం, పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని, భవిష్యత్తులో కూడా ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాండు, వార్డు సభ్యులు రమాదేవి, రజిని ,శివకుమార్, పట్టాభి, కృష్ణ యాదయ్య, రామరాజు, సరిత, అలివేలు, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గోదావరి నది వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోతే దీక్షకు దిగుతా..

**బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పడకండి రమాదేవి**



**చట్టం, బాసర :** పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి హైదరాబాద్ మహానగరానికి చెందిన ఓ కుటుంబం ఆనందంతో ప్రయాణం కొనసాగించి, గోదావరి నదిలో స్నానం ఆచరించి నేరుగా అక్షరభ్యాసంతో పాటు ప్రత్యేక దర్శనం చేసుకుందాం అన్న తరుణంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు గోదావరి నదిలో మునిగి మృతి చెందిన విషయం విధితమే ఈ నేపథ్యంలో గోదావరి నది వద్ద ముగ్గురు అన్నదమ్ముల విషాద మరణ ఘటన పై స్పందించిన బి ఆర్. ఎస్ సీనియర్ నాయకురాలు పడకంటి రమాదేవి స్పందిస్తూ, గత సంవత్సరం కూడా హైదరాబాద్ మహా నగరానికి చెందిన ఐదుగురు ఒకేసారి గోదావరి నదిలో మునిగి ప్రమాదవశాత్తు మృతి చెందగా ప్రతి సంవత్సరం గోదావరి నదిలో జల సమాధి కావడం ఇక్కడ ఉన్న నాయకులతో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు ఇలాంటి సంఘటనలపై ఎందుకు స్పందించడం లేదంటూ అగ్రం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా పదిహేను రోజుల్లో గోదావరి నది వద్ద రక్షణ చర్యలు చేపట్టకపోతే స్వయంగా నేను ఆమరణ దీక్ష కు సిద్ధం. అంటూ మద్దత్తు పలికిన బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పడకంటి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రత్యేక గ్రామసభ.. పారిశుద్ధ్యంపై అవగాహన



**చట్టం కథలాపూర్ :** కథలాపూర్ మండలం పోసానిపేటలో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. వర్షాకాలంలో మురికి నీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో కాలువలు కూడుపుతున్నారు అంటూ వచ్చిన కంప్లైంట్ ను వివరిస్తూ సర్పంచ్ ఆకుల సుజాత రాజేందర్ మాట్లాడుతూ వీలైనంత వరకు కాలువలు కూడుపవద్దని వాటిని యధావిధిగా పూడికలు తీయాలని వర్షాకాలంలో ఎవరికి ఇబ్బంది లేకుండా చూస్తానని మాట ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజేశ్వర్, సర్పంచ్ ఆకుల సుజాత రాజేందర్, ఉప సర్పంచ్ గడ్డం రాజేందర్, బత్తుల అశోక్, వేగ్యారపు ఆంజనేయులు, రాగుట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కేజ్వీల్ ట్రాక్టర్లు రోడ్లపై నడిపితే 5వేల జరిమానా : సర్పంచ్ దివిటి రమేష్



**చట్టం న్యూస్ లింగంపేట్ :** ట్రాక్టర్ యజమానులు రోడ్ల పై నడిపితే 5వేలు జరిమానా విధిస్తామని గ్రామ సభలో తీర్మానం చేసినట్లు గ్రామ సర్పంచ్ దివిటి రమేష్ తెలిపారు. పోల్కంపేట్ గ్రామంలో బుధవారం 99 రోజుల ప్రణాళికలో భాగంగా ముగింపు సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గ్రామస్తుల సమక్షంలో కేజీ వీల్స్ ట్రాక్టర్లు రోడ్ల నడపడం వల్ల రోడ్లు చెడిపోతున్నాయని కేజివిల్ ట్రాక్టర్లు రోడ్ల పైన నడిపితే 5వేల జరిమానా విధిస్తామని తీర్మానం చేయడం జరిగింది. ట్రాక్టర్ యజమానులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు, అలాగే గత వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయిన చౌదరి చెరువు కట్టను వెంటనే మరమ్మతు చేయాలని, గ్రామపంచాయతీ పక్కనే తెగిపోయిన మత్తడి కట్టను మరమ్మత్తు చేయాలని, వరదల కారణంగా కొట్టుకపోయిన బ్రిడ్జిలను, వెంటనే బాగు చేయాలని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానం చేసి అధికారులకు పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దివిటి రమేష్, ఉప సర్పంచ్ లలిత విట్టల్ సెక్రటరీ అశ్వఖ్, స్పెషల్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈ సతీష్, జీపీవో శ్రీకాంత్, జె ఎల్ ఎం రాజు, అటవీశాఖ అధికారులు నాందేవ్, వార్డు సభ్యులు చంద్రయ్య, నరేష్ గౌడ్, హేమలత వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, పోచవ్వగారి సంతోష్, సాయిలు, సాయిలు, సామ్రాట్, సుశీల నల్లపోచయ్య, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, గ్రామపంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ సెంటర్‌లో చోరీ పాల్పడ్డ దుండగులు




**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని బిద్రెల్లిలో మంగళవారం గుర్తుతెలియని దుండగులు స్థానిక గురుకృప ఆన్లైన్ మల్టీ సర్వీస్ సెంటర్లో దుండగులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ మెరుపు సమాచారాన్ని గ్రామస్తులు చెర తీయగా స్థానిక బాసర సీఐ దీపక్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఆన్లైన్ సెంటర్ కౌంటర్ నుంచి 4 నగదు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బుధవారం నేరుగా క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించి త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో వారు మాట్లాడుతూ... మహారాష్ట్ర ప్రాంతం సమీపాన ఉండడం వలన దొంగల బారి నుండి గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా అనుమానితులు ఉంటే వారిని తక్షణమే పోలీస్ స్టేషన్కు సమాచారం చేరదీయాలని పేర్కొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటా..

## జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

(చట్టం ప్రతినిధి కామారెడ్డి)








గాంధారి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కురుపాటి రఘు కుటుంబాన్ని జిల్లా ఎస్పీ పరామర్శించారు. కామారెడ్డి జిల్లా గాంధారి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కురుపాటి రఘు గారు గుండెపోటుతో నిన్న ఆకస్మికంగా మరణించడం పట్ల జిల్లా పోలీసు శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర బుధవారం బాన్సువాడలోని మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రఘు భార్య రజిని, కుమార్తెలు రసజ్ఞ (8వ తరగతి), అమూల్య (6వ తరగతి), తల్లి చంద్రకళ గారిని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ కురుపాటి రఘు విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే పోలీస్ సిబ్బందిలో ఒకరని పేర్కొన్నారు. ఆయన మరణంతో పోలీస్ శాఖ ఒక మంచి కానిస్టేబుల్‌ను, కర్తవ్యనిరతిగల సహచరుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రఘు కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మనోధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని సూచించారు. రఘు సేవలను స్మరించుకుంటూ జిల్లా పోలీసు శాఖ తరఫున సేవలను స్మరించుకుంటూ ఎస్పీ నివాళులర్పించారు. ఆయన అంకితభావం, సేవా తపన పోలీస్ శాఖలో చిరస్థాయిగా గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. "కర్తవ్య నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన కానిస్టేబుల్ కురుపాటి రఘు సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతాయి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఎస్పీ తెలిపారు . ఈ కార్యక్రమంలో బాన్సువాడ టౌన్ ఎస్‌హెచ్ఓ శ్రీధర్, బాన్సువాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ అక్రమ పాఠ్యపుస్తకాల నిల్వలపై విద్యాశాఖ మెరుపు దాడి



**భారీగా పుస్తకాలు, యూనిఫార్మ్స్ స్వాధీనం.. గోదాముకు సీల్**

చట్టం, నిర్మల్ ప్రతినిధి :

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్మ్‌స్‌ను భారీ ఎత్తున నిల్వ ఉంచి విద్యార్థుల తల్లిదండ్రులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో నిర్మల్ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌కు సంబంధించిన అక్రమ నిల్వ కేంద్రంపై జిల్లా విద్యాశాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. ఇటీవల విద్యార్థి సంఘాల ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టారు. మండల విద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేట్ గృహంలో వేలాది పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫార్మ్స్, బెల్టులు, టైలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అధికారులు అక్కడే పుస్తకాలు, యూనిఫార్మ్‌స్‌ను స్వాధీనం చేసుకుని గదికి సీల్ వేశారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతూ మార్కెట్ ధరల కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు.

**కఠిన చర్యలు తప్పవు**

నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పుస్తకాలు, యూనిఫార్మ్స్ విక్రయించిన పాఠశాల యాజమాన్యంపై, ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

**బలవంతపు కొనుగోళ్లు నిషేధం**

ఏ ప్రైవేట్ లేదా కార్పొరేట్ పాఠశాల కూడా విద్యార్థులు నిర్దిష్ట దుకాణాల్లోనే లేదా పాఠశాల ద్వారా మాత్రమే పుస్తకాలు, యూనిఫార్మ్స్ కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయరాదని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు కొనసాగితే సంబంధిత విద్యాసంస్థల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు.

**జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు**

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ, పుస్తకాల విక్రయాలు, యూనిఫార్మ్‌ల బలవంతపు అమ్మకాలపై జిల్లావ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

**విద్యార్థి సంఘాల స్పందన**

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీపై విద్యాశాఖ తీసుకున్న చర్యలను స్వాగతిస్తున్నామని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. భవిష్యత్తులో ఏ విద్యాసంస్థ అయినా ఇలాంటి అక్రమాలకు పాల్పడితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే యాజమాన్యాలపై ఉద్యమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కైలాష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధానికి ఎక్సైజ్, పోలీస్ శాఖల సహకారం కోరిన ధన్నారం వాసులు

**2వ వార్డులో బెల్ట్ షాపులు బంద్ చేసిన నేపథ్యంలో అధికారులకు వినతిపత్రాలు**

చట్టం, వికారాబాద్ ప్రతినిధి :

వికారాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డు ధన్నారం గ్రామంలో గ్రామస్తుల ఐక్యతతో బెల్ట్ షాపులను పూర్తిగా బంద్ చేసిన నేపథ్యంలో మద్యపాన నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు ఎక్సైజ్, పోలీస్ శాఖల ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామ పెద్దలు, యువకులతో కూడిన బృందం ముందుగా వికారాబాద్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం సమర్పించింది.




"గ్రామంలో మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులను స్వచ్ఛందంగా నిషేధించుకున్నాం. ఈ నిర్ణయం అమలులో ఎక్సైజ్ శాఖ పూర్తి సహకారం అందించాలి. తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చట్టవ్యతిరేకంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ, "మా పిల్లల భవిష్యత్తు కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎక్సైజ్, పోలీస్ శాఖల సహకారం లేకపోతే మళ్లీ బెల్ట్ షాపులు పుట్టుకొచ్చే ప్రమాదం ఉంది. అందుకే వారానికి కనీసం ఒకసారి తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మే వారిపై ఉక్కుపాదం మోపాలి" అని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామస్తులు డీఎస్పీ అంజయ్య, టౌన్ సీఐ రఘుకుమార్‌ను కలిసి మరో వినతిపత్రం అందజేశారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మద్యపాన నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పోలీస్ శాఖ సహకారం అందించాలని కోరారు. వినతిపత్రాలపై స్పందించిన అధికారులు గ్రామస్తుల నిర్ణయాన్ని అభినందించారు. మద్యపాన నిషేధం కోసం గ్రామస్తులు చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు. గ్రామంలో వారానికి రెండు సార్లు ఎక్సైజ్, పోలీస్ శాఖల సంయుక్త ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే కళాజాత కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు చేపడతామని తెలిపారు.

## జీలుగు సాగుతో భూమికి బలం – రైతుకు లాభం

చట్టం, కురవి:

రైతులు తమ పొలాల్లో జీలుగు (గ్రీన్ మ్యాన్యూర్) సాగు చేపట్టడం ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు పంటల దిగుబడులు పెరిగి ఆర్థికంగా లాభపడతారని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ చంద్ర, ఆత్మ కమిటీ ఛైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. కురవి ఆంధ్ర బ్యాంకు సొసైటీలో రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంట అవశేషాలను కాల్చివేయకుండా భూమిలోనే కలియదున్నాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జీలుగు విత్తనాలను పొలాల్లో చల్లి, పూత దశకు చేరుకున్న తర్వాత వాటిని భూమిలో కలియదున్నడం వల్ల భూమికి సహజ ఎరువుల మాదిరిగా ఉపయోగపడుతుందని తెలిపారు. జీలుగు సాగు ద్వారా మొక్కలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం, మ్యాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ పోషకాలు సమృద్ధిగా అందుతాయని చెప్పారు. దీంతో రసాయన ఎరువుల వినియోగం తగ్గి, ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు. భూమి ఆరోగ్యం మెరుగుపడి దీర్ఘకాలికంగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం జీలుగు విత్తనాలను 50 శాతం రాయితీతో అందిస్తున్నందున ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా విత్తనాలను తీసుకోవాలని వారు కోరారు. సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. విజయ్ చంద్రను ఆత్మ కమిటీ ఛైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, పెస్టిసైడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రఘుపతి, రవి, దామోదర్, ఉపేందర్ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## గ్యాస్ లీక్ అయి ముగ్గురికి తీవ్ర గాయాలు

**తప్పిన పెను ప్రమాదం.. వినాయక నగర్ లో ఘటన**







**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** ఓ ఇంటిలో గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి.. దీంతో మంటల దాటికి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సిలిండర్ పేలేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలోని వినాయక నగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఇంట్లో వంట గ్యాస్ లీకవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో మంటలను ఆర్పుతుండగా మల్లవ్వ, మౌనిక, అలేఖ్య అనే ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు గమనించి వారిని బయటకు తీసుకువచ్చారు. విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కాగా గాయపడిన వారిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారు చికిత్స పొందుతున్నారు. కాగా గ్యాస్ లీకైనప్పుడు సిలిండర్ పేలి ఉంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై వివరణ కొరకు అగ్నిమాపక శాఖ అధికారిని ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు బాట పడతా..




**చట్టం పెద్దపల్లి :** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 1,13,14,15 వార్డులకు సంబంధించిన వార్డు సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ..మున్సిపల్ కౌన్సిలర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, నాళాలు ఎప్పటికప్పుడు శుభపరచుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాను త్వరలోనే వార్డు బాట పడతానని చెప్పారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో నాలుగైదు రోజులు పర్యటిస్తానని చెప్పారు. కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా వార్డుల్లో త్వరలోనే సిసి రోడ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందన్నారు. ఇప్పటికే పట్టణంలో రోడ్ల వెడల్పు, సిసి రోడ్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని స్పష్టం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను ఎలాంటి కటింగులు లేకుండా అనేక సమస్యలను అధిగమిస్తూ కొనుగోళ్లు పూర్తిచేసి, రైతుల సేవలో తరించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రైతు భరోసా, రైతు భీమా, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనిని చెప్పారు. రాబోయే రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్నలను పొందుతుండగా, బీఆర్ఎస్ ఓరువలేకపోతుందని చెప్పారు. ప్రతిపక్షాల ధర్నాలకు రైతులు రావడంలేదని స్వయంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొనడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**సబితం జలపాతం వద్ద ప్లాస్టిక్ రహిత సమాజం.. అటవీ సంరక్షణపై అవగాహన కార్యక్రమం**

**చట్టం పెద్దపల్లి :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజం, అటవీ సంరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి మండలం సబితం గ్రామంలోని పర్యాటక ప్రాంతమైన సబితం జలపాతం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులకు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలు, వాటి నిర్మూలన అవసరం, రీసైక్లింగ్ ద్వారా కలిగే ప్రయోజనాలు, అటవీ సంపద సంరక్షణ ప్రాముఖ్యతపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సబితం గ్రామ సర్పంచ్ ఎస్.ఎన్. సరోజన, కానుపురం ఎస్ఐ ప్రసాద్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ స్వప్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీ రేంజ్ అధికారి టి. సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. అటవీ సంపద పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ హితమైన అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా భావి తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. వినయ్ నాయక్, రమేష్, దేవదాస్, కొమురయ్య, నర్సయ్య, రహమతుల్లా, అమీరుద్దీన్, ప్రదీప్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం : పెద్దపల్లి డీసీపీ

- గోదావరిఖని డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన డీసీపీ
- చికిత్స పొందుతున్న వారితో కలిసి మొక్కలు నాటిన అధికారులు

**చట్టం రామగుండం :**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌ను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి సందర్శించారు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న యువకులతో మాట్లాడిన డీసీపీ వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిని న్యాయస్థానం ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డిఅడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నామని చెప్పారు. అక్కడ వారికి వైద్య చికిత్సతో పాటు మానసికంగా మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, గంజాయి సేవించే వారిని గుర్తించి ఆ అలవాటు నుంచి దూరం చేస్తే సరఫరా కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, పెద్దలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి నిందితులపై కేసులు నమోదు చేసి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తారని, పాజిటివ్‌గా తేలిన వారిని డిఅడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తామని తెలిపారు. నిపుణులైన వైద్యుల సహాయంతో మత్తు బారిన పడిన వ్యక్తులు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత పెద్దపల్లి జిల్లాను నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీసీపీ రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈగల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర రావు, వైద్య అధికారులు, సిబ్బంది, డిఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో కలిసి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## గెలిచిన సంఘాల చేతగానితనంతోనే నిలిచిపోయిన మెడికల్ బోర్డు సమావేశాలు : రియాజ్ హైమద్



**చట్టం రామగుండం :** బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ వద్ద హెచ్‌ఎంఎస్ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పతెం రాజబాబు అధ్యక్షతన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేబీసీసీఐ సభ్యుడు, హెచ్‌ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ హైమద్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో గత 14 నెలలుగా మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించకపోవడం వల్ల అనేక మంది కార్మికులు అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెల కనీసం రెండు మెడికల్ బోర్డు సమావేశాలను నిర్వహించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న కార్మిక కుటుంబ సభ్యులకు రాజకీయ జోక్యం లేకుండా పాత విధానంలోనే నియామక పత్రాలను ఒకేసారి అందజేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, గుర్తింపు సంఘం నాయకత్వం కార్మికుల సమస్యల పరిష్కారంపై నిజమైన చిత్తశుద్ధి కలిగి ఉంటే అన్ని సంఘాలను కలుపుకుని సమ్మె నోటీసు ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఏఐటీయూసీ నాయకత్వం యాజమాన్యానికి ఒంటరిగా సమ్మె నోటీసు ఇవ్వడం కార్మికులను మోసం చేయడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఎం. శివారెడ్డి, పిట్ సెక్రటరీ దుర్గం వెంకటేష్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఎస్. కుమార్ గౌడ్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే ఇనూస్, ఏరియా క్లర్క్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్‌కు ఘన స్వాగతం



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి.ఆనంద్ ఐపీఎస్ ను, నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఐఏఎస్, నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.రాష్ట్ర డిజిపితో పాటుగా ఉమెన్ సేఫ్టీ, సిఐడి, ఏసీబీ డిజిపి చారు సిన్హా ఐపీఎస్, మల్టీ జోన్ ఐజి చంద్ర శేఖర్ ఐపీఎస్ లను కూడా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ స్వాగతం పలికిన వారిలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఐఏఎస్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయికిరణ్ ఐపీఎస్, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, ఏఓ యూనస్ అలీ, పోలీసు అధికారులు ఉన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాల కొరకు లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య ప్రవేశాల కొరకు విద్యార్థులను బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వెనకబడిన కులాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో ఉచిత ప్రవేశ సౌకర్యాన్ని కల్పించిందని అన్నారు. లక్కీ డ్రా లో ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని చక్కగా చదువుకొని, ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. లక్కీ డ్రా లో ఎంపిక కాని వారు నిరాశ చెందవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, సహాయ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి డి. లత, పోషకులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడీ 4,399 రోజుల పాలన పూర్తి చేసిన సందర్భంగా బీజేపీ కృతజ్ఞత సభ



**చట్టం రామాయంపేట :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రులలో అత్యధిక కాలం పాటు పదవిలో కొనసాగిన నాయకుల జాబితాలో మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించి 4,399 రోజుల పాలన పూర్తి చేసిన సందర్భంగా రామాయంపేటలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు మాట్లాడుతూ, 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోడీ గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తూ అనేక సంస్కరణలు అమలు చేశారని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఫసల్ బీమా యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, జన్ ధన్ యోజన, అటల్ బీమా పథకం, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందారని తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా విద్యుత్ సౌకర్యాల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణం, సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రోత్సాహం, పేదలకు గృహ నిర్మాణ సహాయం, జీఎస్టీ అమలు, ఆర్టికల్ 370 రద్దు వంటి కీలక నిర్ణయాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. దేశంలోని చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా "సబ్ కా సాథ్ - సబ్ కా వికాస్ - సబ్ కా విశ్వాస్ - సబ్ కా ప్రయాస్" సిద్ధాంతంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే దిశగా మోడీ నాయకత్వం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అవినాష్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్ గౌడ్, బక్కయ్య, యాదగిరి, బాలరాజ్, ప్రశాంత్, శంకర్ గౌడ్, కన్నయ్య, నాగరాజు, అనిల్, రాజేంద్ర ప్రసాద్, చింతల శేఖర్, దయానంద రెడ్డి, భానుచందర్, మరుకు వెంకటి, దోమకొండ రాములు, నందిగామ నవీన్, అరుణ్, యాదగిరి యాదవ్, సాదుల నాగరాజు, శేఖర్, రాగి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాల కంటే వేగం ముఖ్యం కాదు.. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి

**యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత: డీసీపీ బి.రామ్ రెడ్డి**

**చట్టం, పెద్దపల్లి :**

ప్రాణాల కంటే వేగం ముఖ్యమేమీ కాదని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి సూచించారు. అలాగే యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని హనుమంతునిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం, గురువుల పట్ల భక్తి కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల వ్యసనం యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, డ్రగ్స్‌కు అలవాటు పడిన వారిలో ప్రవర్తనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని చెప్పారు. ఇంట్లో వస్తువులు ధ్వంసం చేయడం, తల్లిదండ్రులను బెదిరించడం, అవసరం లేని డిమాండ్లు చేయడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను




సంప్రదించాలని, పోలీసులు అవసరమైన కౌన్సెలింగ్‌తో పాటు వైద్య నిపుణులు, మనోవైద్యుల సహకారంతో పిల్లలను సరైన మార్గంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విస్తృత చర్యలు చేపడుతోందని వివరించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత, ఆరోగ్య, వ్యవసాయ, విద్య, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆనందభాష్పాల అమ్మా నాన్నకు ప్రేమతో..




- అమ్మానాన్నల కష్టానికి పిల్లల 'టాప్' గిఫ్ట్
- టెన్త్ టాపర్లచే వారి తల్లిదండ్రులకు ఘన సన్మానం
- ఎంత ఎదిగినా అమ్మానాన్నలను మరువొద్దు
- ఢిల్లీ స్థాయి బాధ్యతల్లోనూ.. సొంత గడ్డపై ప్రేమ
- విద్యార్థులకు రోల్ మోడల్ 'వడ్డేపల్లి రామచందర్'
- బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి

**చట్టం రామగుండం :**

రామగుండం నియోజకవర్గ గడ్డపై భావోద్వేగాలు వెల్లువెత్తిన వేళ, పదవ తరగతి టాపర్ల ప్రతిభను కొనియాడుతూ బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన "అమ్మా నాన్నకు ప్రేమతో" పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం అశేష జనవాహిని మధ్య కంటిపాపలాంటి జ్ఞాపకంగా నిలిచిపోయింది. ముఖంపై చిరునవ్వు, గుండెల్లో కాస్త భావోద్వేగం దాచుకుని మైక్ అందుకున్న సంధ్యారాణి.. తన ప్రాణసమానులైన ప్రజలకు, ఆడపడుచులకు, రేపటి భవిష్యత్తును మోసుకొచ్చిన విద్యార్థులకు హృదయపూర్వక వందనాలు అర్పిస్తూ, "మనం ఏ స్థాయికి ఎదిగినా నడిపించే శక్తులు జన్మనిచ్చిన అమ్మ, నూరేళ్ల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే నాన్న మాత్రమేనని, నేటి పిల్లల విజయం వెనుక ఆ తల్లి కన్నీళ్లు, తండ్రి కష్టాలు దాగున్నాయని" సెంటిమెంట్‌ను పండించారు. ఈ అద్భుతమైన వేదికకు సరికొత్త ఐకానిక్ హుందాతనాన్ని తెచ్చిన ముఖ్య అతిథి, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ ప్రయాణం పిల్లలకు ఒక రోల్ మోడల్ అని, ఢిల్లీ స్థాయిలో సమాజ వెనుకబడిన వర్గాల గొంతుకగా నిలుస్తూ మన ప్రాంత పిల్లలను దీవించడానికి రావడం తమ అదృష్టమని ఆమె కొనియాడారు. కేవలం ఎన్నికల కోసమో, పదవుల కోసమో కాకుండా.. ఈ మట్టితో, ఇక్కడి ప్రజలతో గత 20 సంవత్సరాలుగా ఒక కూతురిగా, అక్కగా, చెల్లెలిగా సాగుతున్న తన పేగు బంధాన్ని గుర్తుచేసుకుంటూ సంధ్యారాణి కాస్త ఎమోషనల్ అయ్యారు. ఆనాడు కరోనా మహమ్మారితో ప్రపంచం వణికిపోతూ, కన్నవారిని ముట్టుకోవడానికి కూడా జనం భయపడిన చీకటి రోజుల్లో, ప్రాణాలకు తెగించి తాను చేసిన సేవలు పబ్లిసిటీ కోసం కాదని.. ఒక మహిళగా, తల్లిగా తన బాధ్యతగా భావించి చేశానని, ఆ క్లిష్టసమయంలో తన భర్త "కందుల పోషం" అందించిన తోడ్పాటు వల్లే ఆయన తనకు దేవుడిగా నిలిచారని కళ్లల్లో తడితో వివరించారు. ఆ అచంచలమైన నమ్మకమే నేడు తనను బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మీ ముందు నిలిపిందని, పదవులు వస్తుంటాయి పోతుంటాయి కానీ.. ఈ 20 ఏళ్లలో తాను సంపాదించుకున్న అతిపెద్ద ఆస్తి ప్రజల ప్రేమేనని స్పష్టం చేశారు. టెన్త్ క్లాస్ అనేది జీవితంలో ఒక మైల్‌స్టోన్ మాత్రమేనని, రేపు పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు లేదా దేశాన్ని నడిపించే లీడర్లుగా ఏ లగ్జరీ కార్లలో తిరిగినా.. చేతులు అరిగేలా పనిచేసిన అమ్మానాన్నలను గుండెల్లో పెట్టుకోవడమే అసలైన గిఫ్ట్ అని మోడర్న్ యూత్‌కు హితవు పలికారు. పిల్లలకు చదువుతో పాటు సంస్కారాన్ని ఇవ్వాలని తల్లిదండ్రులను కోరుతూ, ఈ రోజు తామిచ్చే జ్ఞాపికలు కేవలం షీల్డ్‌లు కావు.. మీ భవిష్యత్తుకు గ్రీన్ సిగ్నల్స్ అని, పెద్దల ఆశీస్సులతో ఈ కందుల సంధ్యారాణి సామాజిక సేవ ఇలాగే కొనసాగుతుందని ప్రకటిస్తూ.. "జై హింద్.. భారత్ మాతా కీ జై" అంటూ కార్యక్రమంను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో SRM కన్స్ట్రక్షన్స్ అధినేత మాచిడి మహేందర్, గాండ్ల రాములు, బి ఎం ఎస్ నాయకులు సాగర్, రాజు, సత్యనారాయణ రెడ్డి, పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు దుండె మల్లేష్, పోతరాజుల అంజయ్య మరియు బిజెపి సీనియర్ నాయకులు ముసుకుల భాస్కర్ రెడ్డి, తడగొండ నరసయ్య మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య, బోడకుంట సుభాష్, మెరుగు నరేష్ గౌడ్, ఆకుల శశి, నాయకులు కోడూరి రమేష్, జక్కన బాలు, జక్కుల పద్మ, కండె సాగర్, బూడిద హర్ష, బియ్యాల మహేందర్, మీస వికాస్, సిలారపు కళ్యాణ్, పరకాల మురళి గౌడ్, అందె రాజ్ కుమార్ చారి, మూకిరి రాజు, ఎల్తూరి సరిత రాజయ్య, జక్కుల ప్రవీణ్, అనుమాండ్ల వెంకటేష్, గోపు రామన్న, కొలిపాక శంకరయ్య, గోపతి ఐలేష్ దితరులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లోనూ నగర స్థాయి వసతులు కల్పిస్తాం




**చట్టం రామగుండం :** విలీన గ్రామాల్లోనూ నగర స్థాయి వసతులు కల్పిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా 21వ డివిజన్ ఎల్కలపల్లి గేట్, లక్ష్మీ పురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగాడివిజన్ లోని మేజర్ కాలువల్లో పూడిక తీయించి సాఫీగా ప్రవహించేలా ఏర్పాట్లు చేయడంతో పాటు తుప్పలు, పొదలు తొలగించి రహదారి మార్గం సుగమం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విలీన గ్రామాల్లోనూ నీటి సరఫరా పైప్ లైన్ వేసి రక్షిత మంచినీరు సరఫరా చేస్తామని అన్నారు. యు జి డి,లు, రోడ్లు నిర్మిస్తామని అన్నారు. ప్రజలు చెత్త బయట వేయకుండా మునిసిపల్ వాహనానికి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ కందుల స్వరూప సతీష్, నగర పాలక సంస్థ టి పి ఎస్ నవీన్, ఏ ఇ అన్వేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి: అటవీశాఖ క్షేత్ర ఉపాధికారి నజీర్ ఖాన్




**చట్టం, సారంగాపూర్ :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల పరిధిలోని అడెల్లి నందనవనంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నజీర్ ఖాన్ మాట్లాడుతూ వృక్షాలు మానవ జీవనానికి ఆధారమని, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో దండు సాయన్న, వెన్నెల సుజాత, బీట్ అధికారులు, గ్రామ ప్రజలు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

## 49వ డివిజన్‌లో ప్రజా సమస్యలపై మేయర్ ఉమారాణి రమేష్ క్షేత్రస్థాయి పర్యటన



**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ నగరంలోని 49వ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్ల దుస్థితి తదితర సమస్యలను తెలుసుకునేందుకు మేయర్ ఉమారాణి రమేష్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. డివిజన్‌లోని పలు కాలనీలను సందర్శించిన మేయర్ స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడడం, రోడ్ల అధ్వాన్న పరిస్థితి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ పర్యటనలో ఏఎంసీ నజీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పేర్రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ మహిపాల్, మునిసిపల్ సిబ్బంది మరియు స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన మేయర్, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకుని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మేయర్, ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా, ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ మెరుగైన పౌర సేవలు అందించేందుకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని మేయర్ ఉమారాణి రమేష్ స్పష్టం చేశారు.

## కేతి బచావో( పొలాలను రక్షించండి) అభియాన్ కార్యక్రమం

**మండల వ్యవసాయ అధికారి కే. సతీష్ కుమార్**




**చట్టం రామగుండం :** పెద్దపల్లి జిల్లా అంతర్గం మండలం మండలంలోని పెద్దంపేట, రాయదండి గ్రామంలో కేతి బచావో (పొలాలను రక్షించండి) అభియాన్ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కే సతీష్ కుమార్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కే సతీష్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని రైతులకు అవగాహన కల్పిస్తూ ఈ కాలంలో ఏ పంటలు వేయాలో, ఆ పంటలకు ఏ మందులు వాడాలో, పంటలకు ఏ విధంగా జాగ్రత్త తీసుకోవాలో రైతులకు, ప్రజలకు అవగాహన చేయడం జరిగింది. రైతులు పండించాల్సిన పంటల రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రీయ ఎరువులతో నేల లోని భూసారాన్ని పెంపొందించాలని, యూరియాకుప్రత్యామ్నాయం గా నానో ఎరువులు, నీటిలో కరిగే ఎరువులు వాడాలని, పంట వ్యర్థాలు కాల్చకుండా నేల లో కలియదున్ని ఎస్ ఎస్ పి ఎరువు చల్లి ఎరువుగా మార్చాలని, ఈ వానాకాలం ఎల్ నినో వాతావరణ సమస్య నుండి తప్పించుకోవడానికి వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయం గా పెసర, కంది, మినుము, బొబ్బెర, నువ్వులు, చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని, తప్పని సరి వరి వేయవలసి వస్తె తక్కువ పంట కాలం ఉన్న వరి రకాలు సాగు చేయాలని,ప్రస్తుతం రాష్ట్రప్రభుతం, రైస్ మిల్లర్లు సూచించిన, మార్కెట్ లో డిమాండ్ ఉన్న సన్న వరి రకాలు మాత్రమే సాగు చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దంపేట గ్రామ సర్పంచ్ వేముల శ్రీనివాస్, రాయదండి సర్పంచ్ సాదుల స్వప్న, మండల వ్యవసాయ అధికారి కె.సతీష్, రెవెన్యూ తహశీల్దార్ పడాలవర ప్రసాద రావు, మండల ప్రజా పరిషత్ అధికారి గాంధీరావుపేట తిరుపతి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి నవీన్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో ప్రజలకు ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆసుపత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ కు దీటుగా వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో మంచి వైద్యం అందుతుందన్న నమ్మకం ప్రజల్లో పెంపొందించాలని వివరించారు. ఆసుపత్రుల్లో ఏవైనా మౌలిక సదుపాయాల పనులు, వైద్య పరికరాలు అవసరం ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులతో ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చిన్నారులకు టీకాలు నిర్ణీత సమయానుగుణంగా అందివ్వాలన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పనులు త్వరితగతిన పూర్తి చేసి, వైద్యసేవలకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, వైద్యాధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, డిసిహెచ్ఎస్ కాశీనాథ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు పంపిణీ : MEO అంజిల్ రెడ్డి



**చట్టం న్యూస్ లింగంపేట :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం నోటుబుక్కులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి అంజల్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు 20464, నోటు బుక్కులు 28016 వచ్చినట్లు తెలిపారు. బుధవారం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యయులకు అందజేసినట్లు తెలిపారు. గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి తమ లక్ష్యం.. గ్రామ సర్పంచ్ ఐలమ్మ

**గ్రామాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా**



**చట్టం, శంషాబాద్ :** శంషాబాద్ మండల పరిధిలోని జుక్కల్ గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్ల నిర్వహణ వంటి మౌలిక వసతుల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రామలింగం గౌడ్, గ్రామ ఉపసర్పంచ్ వార్డ్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రధానిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నరేంద్ర మోదీ

**మిర్జాపూర్ హనుమాన్ ఆలయంలో బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలు**



**చట్టం న్యూస్, నసురుల్లాబాద్ :** దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు చందూరి హనుమాన్లు ఆధ్వర్యంలో మిర్జాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చందూరి హనుమాన్లు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్నారని తెలిపారు. అత్యధిక కాలం పాటు ఎన్నికల్లో గెలిచి ప్రధానిగా కొనసాగిన నాయకుడిగా కొత్త రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. 4,399 రోజుల పదవీకాలంతో జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డును అధిగమించడం భారత రాజకీయ చరిత్రలో ఒక విశేష ఘట్టమని అన్నారు. గత 12 సంవత్సరాల్లో జనధన్ ఖాతాలు, పీఎం కిసాన్ నిధి, మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన, పీఎం ఫసల్ బీమా యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలతో పాటు ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, ఒకే దేశం-ఒకే పన్ను విధానం, మేక్ ఇన్ ఇండియా వంటి కీలక నిర్ణయాల ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, గంగాధర్, బాబుగౌడ్, భాస్కర్, శ్రీనివాస్, శివకుమార్, రాజు, శంకరప్ప, సాకేత్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్, మజార్, హైదర్, మహేష్ రెడ్డి, రమేష్, సుశీల్ కుమార్, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**బాధిత కుటుంబానికి సాయం చేయాలని విజ్ఞప్తి**



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లెపెల్లి చంద్రమౌళి (55) వడదెబ్బ కారణంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, చంద్రమౌళి తన బిడ్డ డెలివరీ కోసం హుజురాబాద్ ఆసుపత్రిలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగి వస్తుండగా హుజురాబాద్ బస్టాండ్ వద్ద తీవ్ర ఎండల కారణంగా అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు వెంటనే స్పందించి సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడిని విడిచి వెళ్లిపోయాడు. బుధవారం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన అంతిమయాత్రలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చంద్రమౌళికి నివాళులర్పించారు. ఈ ఘటనతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## చిన్నారులకు ఆట వస్తువులు, విద్యా సామగ్రి పంపిణీ

**సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జక్కుల దంపతులు**

**చట్టం అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో చిన్నారులకు ఆట వస్తువులు, స్టడీ మెటీరియల్ మరియు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన జక్కుల రాంబాబు, జక్కుల వెంకటరమణ దంపతులు పాల్గొని చిన్నారులకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు కొత్త బ్యాగులు, విద్యా సామగ్రి మరియు ఆట వస్తువులు అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు జక్కుల దంపతుల సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జక్కుల రాంబాబు మాట్లాడుతూ, చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు చూడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని దేవుడు కల్పించాలని కోరుకుంటున్నానని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటూ మరింత మందికి సహాయం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.



# పల్లె పట్నం తేడా లేకుండా జోరుగా బడి బాట కార్యక్రమం



**చట్టం**

రాష్ట్ర వ్యాప్తంగా పల్లె, పట్నం తేడా లేకుండా జోరుగా బడి బాట.బస్తీ బాట సాగుతోంది తెలంగాణ రాష్ట్రంలో మన ఊరుమన బడికి ఆదరణ పెరిగింది. ఆంగ్లమాధ్యమ బోధనపై విద్యార్థులు,తల్లి దండ్రులు ఆసక్తి కనబుస్తున్నారు. సర్కారు బడుల రూపురేఖలు మారనున్నాయి. ఈ సారి భారీగా ఎన్‌రోల్‌మెంట్ పెరగనుంది. సర్కారు బడుల్లో పిల్లల నమోదు సంఖ్య పెంచడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ముఖ్యంగా 'మన ఊరుమన బడి' కార్యక్రమం ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే కార్యక్రమానికి సర్కారు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మరో వైపు నూతన విద్యాసంవత్సరం జూన్ 15నుండి ప్రారంభమవుతుండటంతో పాఠశాలల్లో కొత్తగా విద్యార్థుల ప్రవేశాలు పెంచడంపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అందులో భాగంగా ఈ నెల 3 నుండి ప్రొఫెసర్ జయశంకర్ పేరిట బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 19 వరకు కొనసాగనున్నది. రోజు వారీగా పాఠశాల స్థాయిలో వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నారు.ప్రతీ రోజు బడి బాట లో నూతన ప్రవేశాలు భారీగా జరుగుతూ వున్నాయి. అనేక జిల్లాలలో చాల మంది పిల్లలు సర్కారు బడుల్లో చేరేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు.. అయితే ఇందులో ప్రైవేటు పాఠశాలల నుంచి సర్కారు బడుల్లో చేరే వారి పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. ఎండ ను లెక్క చేయకుండా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయబృందాలు, విడిగా ప్రతీ విద్యార్థి, వారి తల్లి దండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రచారం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కూడా పిల్లలు భారీగానే చేరుతున్నారు. బడి బాట కార్యక్రమం అమలులో భాగంగా తొలి రోజు పాఠశాల పరిధిలోని ఆవాస ప్రాంతాల్లో పిల్లల వివరాలను ఆయా పాఠశాలల టీచర్లు ఇంటింటికి తిరిగి నమోదు చేశారు. ప్రధానంగా బడిబాట ప్రాధాన్యంపై ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, తల్లిదండ్రులతో సమావేశం, మన ఊరుమన బడి పథకం ద్వారా సమకూరే మౌలిక సదుపాయాలు, ఆంగ్ల మాధ్యమం గురించి వివరిస్తున్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా బడిబాట కార్యాచరణ అమలు చేస్తున్నారు. సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఏటా బడిబాట కార్యక్రమాన్ని జూన్‌లో నిర్వహిస్తుంటారు . బడిబాట కార్యకమం ద్వారా బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగడంపై దృష్టి సారించింది. గత విద్యాసంవత్సరం నుంచి 'మన ఊరుమన బడి' కార్యక్రమాన్ని అమల చేస్తుండటంతో పాఠశాలలకు మహర్దశ పట్టింది.సర్కారు పాఠశాలలను 'మన ఊరుమన బడి' కింద ఎంపిక చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు కూడా దాదాపు పూర్తి అయినాయి. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు పెరిగాయితాంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగింది. ఆంగ్ల మాధ్యమం లో పిల్లలు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాల్లో కూడా ఓ వైపు తెలుగు, మరోవైపు ఆంగ్లంలో పాఠ్యపుస్తకాలను ముద్రించి పంపిణీ చేయనున్నారు. పిల్లల విద్యాభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించి వారిని చేర్పించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. అన్ని జిల్లాల్లో లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ సారి ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించారు. బడిబాటలో భాగంగా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడీడు పిల్లలను బడిలో చేర్చుకుంటున్నారు.. మన ఊరు మన బడి కార్యక్రమంలోనిధులు విడుదల అయ్యి వాటితో నీటి వసతి, విద్యుదీకరణ, శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టారు.ప్రతీ రోజు ఆయా పాటశాల లో విధులు నిర్వహిస్తూ వున్న ఉపాధ్యాయులు ఉదయం 7 నుండి 11 గంటల వరకు గ్రామాలలో తిరుగుతూ ఎండ వేడిమి నీ సైతం లెక్క చేయకుండా బడి బాట కార్యక్రమం లో పాల్గొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో వున్న సౌకర్యాలు తల్లి దండ్రుల కి చెపుతూ వున్నారు.ఇంటి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ వున్నారు. జిల్లా అధికారులు కూడా ఎప్పటి కప్పుడు బడి బాట కార్యక్రమం మీద సమీక్ష సమావేశం నిర్వహించి సలహాలు సూచనలు ఇస్తూ వున్నారు బడి బాట కార్యక్రమం విజయవంతం లో ప్రజా ప్రతినిధులు, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలు, యువత, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, మహిళా సంఘాలు , అగన్వాడీ టీచర్లు భాగస్వామయం అవుతూ వున్నారు. సర్కారు బడి..కొలువులకు నిధి. ప్రభుత్వ బడుల రక్షణ మనందరి కర్తవ్యం. ఈ బడి బాట లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం అవుదాం. జూన్ 15నుండి పాఠశాలలు ప్రారంభం అవుతాయి .ఉపాధ్యాయులు కూడా బడికి వెళ్ళేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ సారి ప్రభుత్వం విద్యార్థులకు సి ఎం బ్రేక్ ఫాస్ట్ ను అందించనుంది

**కామిడి సతీష్ రెడ్డి ములుగు పల్లి ఉన్నత పాఠశాల**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా. 9848445134.**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

## సమస్యలు పరిష్కారం కాకుంటే జూన్ 22 తర్వాత సమ్మె:
# ఏఐటియుసి హెచ్చరిక

**చట్టం, రామగుండం :**

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే జూన్ 22 తర్వాత సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం గోదావరి ఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించారు. గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం కార్మికుల పెండింగ్ సమస్యలపై యాజమాన్యంతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినప్పటికీ ఎలాంటి స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేదన్నారు. కార్మికుల ఆందోళనల నేపథ్యంలో జూన్ 7, 8 తేదీల్లో కొత్తగూడెంలో జరిగిన ఏఐటియుసి కేంద్ర కమిటీ సమావేశాల్లో సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ మేరకు జూన్ 8న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం 31 డిమాండ్లతో సమ్మె నోటీసును యాజమాన్యానికి అందజేసినట్లు చెప్పారు. సమ్మె నోటీసులో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిల విడుదల, నిలిచిపోయిన మెడికల్ బోర్డు నిర్వహణ, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్లకు అలియాస్ పేర్లతో ఉద్యోగాల కల్పన, సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఆదాయపన్ను యాజమాన్యమే చెల్లించడం, కొత్త గనుల ప్రారంభం, ఓపెన్‌కాస్ట్ మరియు అండర్‌గ్రౌండ్ గనుల్లో ఆధునిక యంత్రాలు, స్పేర్ పార్ట్స్ ఏర్పాటు వంటి ప్రధాన డిమాండ్లు ఉన్నాయని వివరించారు. అలాగే 2003 ఒప్పందం ప్రకారం బొగ్గు ఉత్పత్తిని శాశ్వత కార్మికులతోనే నిర్వహించడం, 202526 ఆర్థిక సంవత్సర లాభాల్లో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించడం, 150/200 మస్టర్ రెగ్యులేషన్‌కు సంబంధించిన సర్క్యులర్ రద్దు, మైనింగ్ మరియు ఈ అండ్ ఎం క్యాడర్ సమస్యల పరిష్కారం, డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశం కల్పించడం వంటి అంశాలను కూడా డిమాండ్ చేసినట్లు తెలిపారు. సమ్మె నోటీసు గడువు ముగిసేలోపు యాజమాన్యం గుర్తింపు సంఘంతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఇతర కార్మిక సంఘాలను కూడా కలుపుకొని జూన్ 22 తర్వాత సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రాజకీయ జోక్యం కారణంగా గుర్తింపు పొందిన కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టారని ఆరోపించారు. కొత్త యంత్రాలు, విడిభాగాల కొనుగోలుకు నిధులు లేవని యాజమాన్యం చెబుతోందని, భవిష్యత్తులో కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రాజకీయ జోక్యానికి అతీతంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, సింగరేణి సంస్థను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు, బ్రాంచి కార్యదర్శులు మరియు కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలి



**మేయర్ మహంకాళి స్వామి**

**చట్టం, గోదావరిఖని:**

ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 10,11,39,40.41,42,43,52,53,54,55,56,57, 58 డివిజన్ లకు సంబంధించిన క్లస్టర్ లెవెల్ వార్డు సభ రాజస్థాన్ భవన్ , కళ్యాణ్ నగర్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ,సబ్సిడీ గ్యాస్ వంటి అనేక సంక్షేమ పథకాలను పేద వాళ్ళ కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం గ్రహించాలని అన్నారు. ఎం.ఎల్ ఏ ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి చూసి పది మందికి చెప్పాలని అన్నారు. నిరంతరం రామగుండం నగర అభివృద్ధి ని తలుస్తూ నిధుల కోసం మంత్రులను కలుస్తూనే ఉన్నారని అన్నారు. కేవలం రెండేళ్ల కాలంలోనే వెయ్యి కోట్ల అభివృద్ధి చేసారని అన్నారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగానే కాలువ పూడికతీత పనులను నిర్వహిస్తున్నామని అన్నారు. వైద్య, ఆరోగ్య, పోలీస్ , మునిసిపల్ తదితర విభాగాల అధికారులు చేసిన సూచనలను పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నగరాన్ని స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నంల్ ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. నగరంలో కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి విరివిగా మొక్కలు పెంచాలని అన్నారు.భూ గర్భ జల మట్టాలు పెరగడానికి ఇంకుడు గుంతలు తవ్వాలని అన్నారు.నగర అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామని అన్నారు. తమ పిల్లలు ఆన్ లైన్ బెట్టింగులు,గంజాయి తీసుకోవడం వంటి వ్యసనాల బారిన పడకుండా తల్లితండ్రులు జాగ్రత్త వహించాలని అన్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రామగుండంలో దిగ్విజయంగా నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు.ఎం ఎల్ ఏ ఆదేశాల మేరకు మేయర్ ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకే డివిజన్ లో తిరుగుతూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండడం సత్ఫాలితాలు ఇస్తున్నదని అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ),రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి విపత్తులు రాకుండా అన్ని విభాగాల సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతున్నదని అన్నారు.వేలాడుతున్న విద్యుత్ తీగలు, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల గురించి తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ నిబంధనలు పాటించి చెత్తను విభజించి ఇవ్వాలని అన్నారు. కాగా ఈ సందర్భంగా సర్ పై ఎం ఆర్ ఓ రవీందర్ వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు, హెచ్ పి వి వ్యాక్సిన్ వేసుకోవడం గురించి అడ్డగుంటపల్లి మెడికల్ ఆఫీసర్ స్నేహ లత వివరించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు నివారించడంపై ట్రాన్స్ కో ఎ ఇ జమీల్ పాషా అవగాహన కల్పించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం , ట్రాఫిక్ నిబంధనల గురించి ట్రాఫిక్ సి ఐ రాజేశ్వర్ రావు వివరించారు. శాంతి భద్రతలు ,వివిధ రకాల నేరాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వన్ టౌన్ సి ఐ ఇంద్రసేనా రెడ్డి వివరించారు.

## ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



**చట్టం శంకరపట్నం :** మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు శంకరపట్నం మండల కేంద్రంలో బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి తిరుపతి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి ఆనందోత్సాహాల మధ్య పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

**ప్రజల మనిషి... అభివృద్ధి ప్రదాత**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తూ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు, విద్యార్థులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వెల్దుర్తి లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ

**సమస్యల పరిష్కారం గురించే గ్రామసభ: ఈవో కృష్ణ**




**చట్టం వెల్దుర్తి:** ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం వెల్దుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆదర్శ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో వ్యవసాయ విస్తరణాధికారి మజ్జిద్ అలీ, ఏఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ వర్షాకాల సన్నదత, సురక్షిత తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ-మన సంరక్షణ, మొక్కల పెంపకం వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ-భద్రతపై తగు సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ విస్తరణాధికారి మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రత కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. వర్షాలు ఆలస్యమైన పరిస్థితులలో వరి సాగు చేసే రైతులు నాటు విధానానికి బదులుగా వెదజల్లే పద్ధతిని అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్, వార్డు సభ్యులు శాకారం శ్రీనివాస్, అంగడిపేట మహేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గాదేపల్లిలో హర్ ఘర్ జల్

**మిషన్ భగీరథ నీటి నాణ్యతను పరిశీలించిన సర్పంచ్ చిన్నారెడ్డి**






**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామ సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి, ఆధ్వర్యంలో గ్రామంలో 'హర్ ఘర్ జల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను సందర్శించి సరఫరా అవుతున్న మంచినీటి నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందుతుందా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సమక్షంలోనే నీటిని టెస్ట్ చేసి సురక్షితమైన తాగునీరు సరఫరా అవుతున్నట్లు నిరూపించి చూపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీటిని అందించడమే గ్రామ పంచాయతీ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మిషన్ భగీరథ ద్వారా నాణ్యమైన నీటిని అందిస్తున్నాం అని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, ఉప సర్పంచ్ సందీప్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్వారీలో మృతి చెందిన ఇద్దరు యువకులు

**న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరిన బాధిత కుటుంబాలు**



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల కేంద్రానికి సమీపంలోని రామంతాపూర్ గ్రామ శివారులో ఉన్న క్వారీలో గత నెల 15న ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటనపై బాధిత కుటుంబాలు న్యాయం కోసం జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌ను ఆశ్రయించాయి. బుధవారం నిర్వహించిన ప్రజా కార్యక్రమానికి హాజరైన బాధిత కుటుంబ సభ్యులు తమ ఆవేదనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ విషాదం చోటుచేసుకుందని ఆరోపిస్తూ, తమ కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మరెవరికీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుల వినతిని స్వీకరించిన కలెక్టర్ ప్రతిమ సింగ్, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నివేదిక అందించాలని అక్కడే ఉన్న తహసీల్దార్ జ్ఞానజ్యోతిని ఆదేశించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు తమకు తక్షణ సహాయం అందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరాయి.

# టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

- చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుదాం
- వరంగల్ లో 5 వ రోజు విజయవంతమైన నిరసన దీక్ష
- సంఘీభావం తెలిపిన పలువురు నాయకులు
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకట్రాములు

**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :**




రాష్ట్ర ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దుచేసి టెస్కో ద్వారానే బెడ్ షీట్స్ కార్పెట్స్ ఖరీదు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న చేనేతల నిరసన దీక్షలు బుధవారం ఐదో రోజు జయప్రదంగా నిర్వహించబడ్డాయి. ఆప్కో మాజీ డైరెక్టర్ దేవులపల్లి సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రసంగిస్తూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేనేత కార్మికులకు త్రిప్త పథకం, చేనేతకు చేయూత తదితర సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు పరచడం లేదని, కూలీ 30% పెంచినట్టు ప్రకటించిన ఇంతవరకు అమలు చేయకపోవడంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సహకార సంఘాల నుండి వస్త్రాలను ఖరీదు చేసిన టెస్కో గత ఏడు మాసాలుగా పేమెంట్ చేయకపోవడం దారుణమన్నారు. చేనేత వృత్తిని శాశ్వతంగా సమాధి చేసిందుకే టెండర్ విధానాన్ని తెచ్చిందని మండిపడ్డారు. కార్మికుల నిరసన ఉద్యమాలు చూసైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకొని చేనేత కార్మికులు నేసిన వస్త్రాలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమం తీవ్ర రూపం దాలిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ ప్రసంగిస్తూ చేనేత కార్మికుల న్యాయమైన పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం 2024లో తాను ప్రకటించిన జీవోను తుంగలో తొక్కి టెండర్ విధానం ప్రవేశపెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆప్కోతర్వాత టెస్కో సహకార సంఘాల ద్వారా చేనేత ఉత్పత్తులను ఖరీదు చేసి ప్రభుత్వ సంస్థలకు అందించేదన్నారు. ఈనాటి ప్రభుత్వం చేనేతలకు ఉపాధి లేకుండా ద్రోహం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని తక్షణమే టెండర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించి చేనేత పరిశ్రమను ఆదుకోవాలన్నారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా చేనేత ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు డాక్టర్ ప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు చందా మల్లయ్య తదితరులు సంఘీభావం తెలుపుతూ ప్రసంగించారు. నిరసన దీక్ష కార్యక్రమంలో చేనేత నాయకులు పంతగాని శ్రీనివాసు, మాషబత్తుల కుమారస్వామి, యెలుగం చిన్న భద్రయ్య, అడిగొప్పల సంపత్, యెలుగం రవిరాజు, యెలుగం వెంకటమలు, కొలిపాక మదనయ్య, కూరపాటి సంపత్, ఊషకోయల రాజేశం, దువ్వల రాజేందర్, యెలుగం చిన కొమురయ్య, బూర వేణు, యెలుగం చిన్న వీరస్వామి, కోట మల్లయ్య, తాటిపాముల మల్లికార్జున్, వావిలాల బిక్షపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్ ఫోన్లు అప్పగింత




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోయినటువంటి మొబైల్ ఫోన్లను బుధవారం రోజు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులు ఆరు గురు 01. ఎన్.రాజు, 02. పుప్పాల రాజన్న, 03. కోమన్ పల్లి చంద్రశేఖర్, 04. మచ్చ మహేష్, 05. కాపెల్లి చిన్నయ్య, 06. షేక్ హుస్సేన్ లకు మొబైల్ ఫోన్ లను అప్పగించబడినదని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా ఒక సంవత్సరం లోపు నాలుగు మొబైల్ 2 రెండు సంవత్సరలోపు రెండు మొబైల్ లు ఇచ్చినట్లు తెలిపారు.

## అనుమానస్పద మృతి

**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామంలోని ముఖాంబిక హోటల్లో పనిచేసే అన్నబోయిన సునీల్, నిన్న తేదీ 9జూన్ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మద్యం త్రాగి ఇంటికి వచ్చి తూలుతూ బోర్లా పడినాడని, ఆ తర్వాత లేచి తన బెడ్ రూమ్ లో పడుకోగా రాత్రి 7 గంటలకు అన్నం తినటానికి తన భార్య జ్యోతి, నిద్ర లేపగా ఎంతకీ లేవక పోయేసరికి గ్రామంలోనీ ఆర్ఎంపీ డాక్టర్ అజయ్, ని పిలిపించి చూపించగా తన భర్త హార్ట్ ఎటాక్ వలన గాని, మరి ఇతర కారణాల వలన గాని చనిపోయి ఉంటాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు పరిచి పరిశోధన ప్రారంభించినట్లు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



## మందు బాబులకు జరిమానా

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో గురువారం రోజు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి. సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో టౌన్ మంగళవారం రోజు స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన 11 మందినీ బుధవారం రోజు కోర్టులో హాజరు పరచగా 9 మందికి ఒక్కొక్కరికి పదివేల చొప్పున మొత్తం 90000/రూపాయల జరిమాన, మిగిలిన ఇద్దరికీ నాలుగు రోజుల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా హానరబుల్ జెఎఫ్సిఎం మేజిస్ట్రేట్ సరళ రాణి, విధించారని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## కరెంటు షాక్తో మహిళా మృతి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో కెనాల్ కట్ట దగ్గర ఒక ఇంట్లో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మహిళ మృతి చెందింది. మృతురాలి పేరు కుంచెపు ఎల్లమ్మ, భర్త శ్రీను, వయసు 37 సంవత్సరాలు, వృత్తి కూలిపని చేస్తూ జీవనం సాగిస్తుంది. తేదీ జూన్09 నాడు రాత్రి అందాజ 9:30నిమిషాల ప్రాంతంలో నీళ్ళు తాగటానికి అని లేసి వంటగది వైపు వెళ్ళింది, అప్పుడు అక్కడ ఉన్న ఇనుప తలుపుకి కరెంట్ తీగ కట్ అయి తలుపు పైన పడి ఉన్నది గమనించలేక, చూసుకోక ఇనుప తలుపును ముట్టుకుని అక్కడికక్కడే కింద పడిపోయింది. వెంటనే పక్కనే ఉన్న కాలనీ వాసులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ రోజు ఉదయం మరణించింది. ఈ సంఘటన విషయము పైన మృతురాలు కూతురు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## మాసాయిపేటకు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అడిషనల్ డీజీకి విజ్ఞప్తి

**అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ డీజీ**



**చట్టం మెదక్ ప్రతినిధి:** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ హైస్కూల్లో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పౌరులతో కలిసి పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించి అనంతరం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాసాయిపేట సర్పంచ్ వీరన్నగారి కృష్ణారెడ్డి, మాసాయిపేట మండలానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామసభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పచ్చదనం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, తగులబెట్టడం చేయకూడదన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, పైపులైన్లు, నీటి ట్యాంకుల శుభ్రతపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవరూ ప్రాణాలు కోల్పోకుండా అధికారులు సంకల్పంతో పనిచేయాలన్నారు. ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం అందించే వారికి రహవీర్ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణలో ప్రతి ఏడాది 7,500 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, మెదక్ జిల్లాలో సగటున 250 మంది మరణిస్తున్నారని తెలిపారు. నిర్లక్ష్యం, అజాగ్రత్త, అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా పాటించాలని, వాటిని ధరించకపోవడం వల్లే అధిక సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతోందని వివరించారు. విద్యాసంస్థల ప్రారంభం నేపథ్యంలో కండిషన్లో లేని స్కూల్ బస్సులు, ఇతర వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య, డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, ఎంపీడీవో విఘ్నేశ్వర్, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, పంచాయతీ సెక్రటరీ రాణి, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పరామర్శలు, శుభకార్యాల్లో పాల్గొన్న తాటి వెంకటేశ్వర్లు

- అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన తాటి వెంకటేశ్వర్లు
- బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి మనోధైర్యం నింపిన బీఆర్ఎస్ నాయకులు
- పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన తాటి

**చట్టం అశ్వారావుపేట :**



అశ్వారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించడంతో పాటు శుభకార్యాల్లో పాల్గొంటూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బూర్గంపహాడ్-అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు సందడి చేశారు. మొదటగా రెడ్డిగూడెం (నడిమిరెడ్డిగూడెం) గ్రామంలో చిప్పల శ్రీనివాసరెడ్డి-సునీత దంపతుల కుమార్తె సీతా మహాలక్ష్మి పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలను అందజేసి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నంతరం కొత్త మామిళ్లవారిగూడెం గ్రామానికి చెందిన కాటూరి వెంకటేష్, రమణ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ మనోధైర్యాన్ని నింపారు. తదుపరి అదే గ్రామానికి చెందిన కోటా మహేష్ లివర్ సంబంధిత వ్యాధితో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం తిరుమలకుంట గ్రామానికి చెందిన కొనకళ్ళ రామలింగయ్య అనారోగ్యంతో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో తాండ్ర యుగేందర్, బిర్రం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సున్నం రామలక్ష్మయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోల్లుకొండ చెన్నారావు, పానుగంటి లక్ష్మణరావు, కొనకళ్ళ శ్రీనివాసరావు, మడకం ముత్యాలరావు, పానుగంటి చెన్నకేశవులు, కాకా సత్యనారాయణ, పొన్నం బాబురావు, కోర్స ప్రతాప్, పొట్ట రాము, ఉప్పాల రత్నాకర్, రామినేని సాగర్, చిన్న సత్యనారాయణ, నాగమహేశ్వరరావు, మోటూరి చిలకరావు, పుల్లారావు, రవి, రాంబాబు, నీలం అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- *హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి
- హనుమకొండ గోపాల్ పూర్ చెరువు పూడిక తీత, రీటైనింగ్ వాల్ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్

**చట్టం/హనుమకొండ**



గోపాల్ పూర్ ఊర చెరువు పూడికతీత పనులు, రీటైనింగ్ వాల్ పనులను త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ గోపాల్ పూర్ లోని ఊర చెరువు పూడిక తీత, రిటైనింగ్ వాల్ పనుల పురోగతిని సాగునీటిపారుదల, మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పూడికతీత, రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనుల వేగవంతానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, సాగునీటిపారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రముఖులు

**చట్టం ఆర్మూర్:**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని మోర్తాడ్ మండల తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న చెలుకల కృష్ణ, తల్లి చెలుకల బుచ్చవ్వ, ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆమె మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోర్తాడ్ మండలానికి చెందిన మోర్తాడ్, గాండ్లపేట్ జీపీఓ పోశెట్టి, జూనియర్ అసిస్టెంట్ సుదర్శన్ విఆర్ఎ కోరం అశోక్, దోన్పాల్, మోర్తాడ్ మండల దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లూరు రాజారాం, జర్నలిస్ట్ మామిడి రాజు, గాండ్లపేట్ గ్రామానికి చెందిన రాజారెడ్డి తదితరులు తహశీల్దార్ స్వగ్రామమైన రుద్రంగి గ్రామానికి వెళ్లి బుచ్చవ్వ, చిత్రపటనికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు తహశీల్దార్ తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, ఆమె మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. రామర్శకు వచ్చిన ప్రముఖులకు తహశీల్దార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు పాల్గొన్నారు.




## భూమి పూజ చేసిన సర్పంచ్



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని డొంకేశ్వర్ మండలం గదేపల్లి గ్రామంలో బుధవారం రోజు మహిళా సమైక్య భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింగం, డిఈ కిషన్ నాయక్, పిఆర్ఏఈ రాజ్ కుమార్, ఉప సర్పంచ్ సందీప్, సెక్రెటరీ సాయిలు, వార్డ్ మెంబర్లు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ నూతన కార్యదర్శికి ఘన స్వాగతం



**చట్టం ఆర్మూర్ :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూరు మండలం కల్లెడి గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అంబటి ప్రవీణ్, కు గ్రామ ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఇస్సపల్లి రాజు మాట్లాడుతూ, నూతన కార్యదర్శి అంబటి ప్రవీణ్, విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శికి తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కల్లెడి గ్రామ ఉపసర్పంచ్, ఆలూరు మండల ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఇస్సపల్లి రాజు, వార్డు సభ్యులు సిరికొండ మహేష్, బొడిగం లక్ష్మీనాగేష్, కొండ్ర శ్యామలపోశెట్టి, మాజీ ఉపసర్పంచ్ పుంజు మానిష్ గౌడ్, గ్రామ యువకులు గంగారం తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి: ఎస్సై శ్రీకాంత్




**చట్టం నవీపేట్ :** ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై శ్రీకాంత్ వాహనదారులకు సూచించారు. అరైవ్య్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారంమండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని అలాగే రహదారి భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు దెబ్బ తగిలి ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు.ఇకపై ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధన ఉల్లంగించినట్లైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

## పాఠశాల బస్సు డ్రైవర్ల లైసెన్సుల తనిఖీ – రోడ్డు భద్రతపై అవగాహన



**చట్టం నవీపేట్ :** నవీపేట్ మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లందరిని పోలీస్ స్టేషన్కు పిలిపించి వారి డ్రైవింగ్ లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్ల వద్ద చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా, పాఠశాల బస్సు నడిపేందుకు అవసరమైన అర్హతలు కలిగి ఉన్నారా అనే అంశాలను పరిశీలించారు. అలాగే వాహనం నడిపే సమయంలో పాటించాల్సిన భద్రతా నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. పాఠశాల బస్సుల్లో చిన్నారులు ప్రయాణించే నేపథ్యంలో వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడపకుండా, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగిసిన డ్రైవర్లు వెంటనే వాటిని పునరుద్ధరించుకోవాలని, చెల్లుబాటు కాని లేదా గడువు ముగిసిన లైసెన్స్తో ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల బస్సులను నడపరాదని స్పష్టం చేశారు. అనంతరం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు మరియు విద్యార్థుల రక్షణకు సంబంధించిన అంశాలపై డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గఫార్తో పాటు వివిధ పాఠశాలలకు చెందిన బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిపై కీలక చర్చ

**సీజనల్ వ్యాధుల నివారణకు అప్రమత్తంగా ఉండాలి**



**చట్టం ఆర్మూర్ :** నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఆంధ్ర నగర్ గ్రామంలో బుధవారం రోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వట్టిగుంట సుష్మ రామకృష్ణ, అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ సంతోష్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ఓడ రాజు, ఉప సర్పంచ్ గుర్రపాటి మురళి పాల్గొన్నారు. గ్రామసభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామంలో పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతుల అభివృద్ధిపై కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచనలు చేశారు. గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అనే లక్ష్యంతో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలి : ఎఫ్ఆర్వో కవిత



**చట్టం, బోథ్** : ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని అటవీశాఖ బోథ్ రేంజ్ అధికారి కవిత అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంగా బుధవారం బోథ్ మండలం కౌఠ(బి)గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అటవీ శాఖ సౌజన్యంతో మొక్కలను నాటారు. అనంతరం అటవీ శాఖ రేంజ్ అధికారి కవిత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడడం ద్వారా ప్రకృతి సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ హెచ్చరించారు. అటవీ, వన్యప్రాణి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆమె అన్నారు. అలాగే వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరామ్, ప్రకాష్, అటవీ శాఖ అధికారులు వసంత్, నాగారావు, బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు వెండి పృథ్వీ, అబ్దుల్ రావుఫ్, రమణ గౌడ్, సోమేష్, రాజు, సబీర్, ప్రశాంత్, రమణ, నరేష్, శ్రీశాంత్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

